శుక్రవారం
23-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 63
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బోట్స్‌వానాలో 2,492 క్యారెట్ల వజ్రం లభ్యం

గాబోరేనె: బోట్స్‌వానాలోని కరోవే గనిలో 2,492 క్యారెట్ల వజ్రం లభ్యమైంది. ఇది ప్రపంచంలోనే ఇది రెండో అతిపెద్దదని లుకారా డైమెండ్ కార్పొరేషన్ వెల్లడించింది. గనిలో ఏర్పాటు చేసిన ఎక్స్-రే డిటెక్షన్ సాంకేతికతో దీనిని గుర్తించినట్లు పేర్కొంది. ఈ వజ్రం విలువ, నాణ్యత విషయాలను మాత్రం వెల్లడించలేదు.

2,492 క్యారెట్ల వజ్రాన్ని కనుగొనడం సంతోషంగా ఉందని లుకారా కార్పొరేషన్ అధ్యక్షుడు విలియం లాంబ్ పేర్కొన్నారు. 1905లో దక్షిణాఫ్రికాలో వెలికితీసిన 3,106 క్యారెట్ల కల్లినల్ వజ్రం ప్రపంచంలోనే అతిపెద్దది.

కశ్మీర్‌లో పొత్తుకు 'సై'

మల్లికార్జున ఖర్గే

శ్రీనగర్: రాబోయే జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఇతర ప్రతిపక్ష పార్టీలతో పొత్తు పెట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని... ఆదిశగా అడుగులు వేస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి ఖర్గే గురువారం ఇక్కడి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల కోసం క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధతపై

- మిగతా 2 లో

11 రోజుల తర్వాత విధుల్లోకి...

ఎయిమ్స్, ఆర్ఎంఎల్, ఐజీహెచ్ వైద్యుల సమ్మె విరమణ

న్యూఢిల్లీ: సమ్మె విరమిస్తున్నట్లు ఢిల్లీ ఎయిమ్స్, రెసిడెంట్ డాక్టర్ల సంఘం (ఆర్‌డీఏ), ఇందిరాగాంధీ ఆసుపత్రి (ఐజీహెచ్), డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి (ఆర్ఎంఎల్) వైద్యులు గురువారం ఒక ప్రకటన చేశారు. తిరిగి విధులకు హాజరవుతామని వెల్లడించారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా దేశవ్యాప్తంగా వైద్యులు సమ్మెతో

- మిగతా 2 లో

అల్‌ఖైదా 'ఖిలాఫత్' కుట్ర భగ్నం

మూడు రాష్ట్రాల్లో 14 మంది అరెస్టు

న్యూఢిల్లీ: భారత్‌లో 'ఖిలాఫత్'కు అల్‌ఖైదా కుట్ర భగ్నమైంది. టెర్రర్ మాడ్యూల్ గుట్టురట్టు అయింది. ఉగ్రసంస్థతో ముడిపడ్డ14 మంది అరెస్టు అయ్యారు. ఈ మేరకు ఢిల్లీ పోలీసులు తెలిపారు. జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఉగ్ర కార్యాకలాపాలు జరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం ఉండటంతో సాయుధ దళాలతో కలిసి సంయుక్త

- మిగతా 2 లో

ఇక సచివాలయ
ఉద్యోగుల వంతు

- పాఠశాలల టాయిలెట్ల ఫొటోలు తీసే బాధ్యతలు
- ప్రభుత్వ ఉత్తర్వుల ఉపసంహరణకు సిబ్బంది డిమాండ్
- లేనిపక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రభుత్వ పాఠశాలల మరుగుదొడ్లను సందర్శించి, వాటి ఫోటోలు తీయాల్సిన బాధ్యతను పట్టభద్రులైన గ్రామ, వార్డు సచివాయాల శాశ్వత ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. పాఠశాల విద్యాశాఖ మధ్యాహ్న భోజన విభాగం తరపున గుట్టుచప్పుడు కాకుండా ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. సంక్షేమ విద్యా సహాయకులు, వార్డు విద్యా కార్యదర్శి సచివాలయాల పరిధిలోని పాఠశాలలు/కళాశాలలకు వెళ్లి మరుగు దొడ్లు, వాష్ బేసిన్ల ఫోటోలు తీసి వాటిని ఐఎంఎంఎస్/సీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. ఈ పనిని వారు వారానికి రెండు రోజులు అంటే అంటే సోమ, గురువారాల్లో చేయాలని సూచించాయి. ఈ ఆదేశాలను గ్రామ, వార్డు ఉద్యోగుల సంఘాల వ్యతిరేకించాయి. రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలిపాయి. ఉన్నతాధికా రులకు అనేకమార్లు వినతులు ఇచ్చినప్పటికీ ఫలితం లేదు. ఉద్యోగుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతున్నప్పటికీ వెనక్కి తగ్గని ప్రభుత్వం... సోమవారం నుంచి టాయిలెట్ల ఫోటోలు తీసే పనిని తప్పకుండా చేయాలని కలెక్టర్లకు ఆదేశాలను గ్రామ, వార్డు సచివాలయాల సంచాలకులు శివప్రసాద్ జారీచేశారు. కలెక్టర్ల ద్వారా మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులకు ఉత్తర్వులు అందాయి. పాఠశాలల్లో పారిశుద్ధ్యం పనులను సంబంధిత సిబ్బంది చూడాలి కానీ సచివాలయ ఉద్యోగులకు ఆ పని అప్పగించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తమవుతోంది. చంద్రబాబు అధికారంలోకి వస్తే పదోన్నతులు వస్తాయని, తమకు న్యాయం జరుగుతుందని ఆశించి భంగపడినట్లు ఉద్యోగులు వాపోతున్నారు. ఇలాంటి పనులు అప్పగించడాన్ని తీవ్రంగా

- మిగతా 2 లో

బీజేపీకి గుణపాఠం తప్పదు

- చంద్రబాబు, నితీశ్ మద్దతు ప్రశ్నార్థకమే
- వైద్యులు, సిబ్బంది భద్రత, రక్షణ కోసం ప్రత్యేక చట్టం
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

విశాలాంధ్ర–హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు సాధించి అధికారంలోకి వస్తామని డాంబికాలు పలికిన బీజేపీని ప్రజలు సగం సీట్లకే పరిమితం చేశారని, త్వరలో జరగనున్న హర్యానా, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలోనూ బీజేపీని ఓడించి గట్టి గుణపాఠం చెబుతారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. మూడోసారి అధికారం చేపట్టినప్పటికీ ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంతకాలం ఉంటుందనేది ప్రశ్నార్థకమేనన్నారు. బీజేపీతో చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్ ఎంతకాలం కలిసి ఉంటారో తెలియదన్నారు. హన్మకొండలో మూడు రోజుల పాటు జరగనున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన రాజా... స్థానిక హరిత హోటల్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, పశ్య పద్మ, కలవేణ శంకర్, వీఎస్ బోస్, ఎన్.బాలమల్లేశ్, ఎం.బాలనరసింహా, ఈటీ నరసింహా పాల్గొన్నారు. రాజా మాట్లాడుతూ రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రత్యక్ష దాడికి దిగాయని విమర్శించారు. మోదీ సర్కారు రాజ్యాంగాన్ని విస్మరిస్తూ ఉద్యోగ నియామకాల్లో లేటరల్ ఎంట్రీ పేరుతో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులను అధికార యంత్రాంగంలోకి చొప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నదన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య శక్తులన్నీ కలిసి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే దేశం– ఒకే ఎన్నిక– ఒకే మతం నినాదంతో విచ్ఛిన్న పాలన సాగించాలని చూస్తోందన్నారు. రాష్ట్రాల హక్కులు, అధికారాలు లాక్కుంటున్నదని, అంబేద్కర్ రాజ్యాంగం స్థానంలో మతతత్వ రాజ్యాంగం ప్రవేశపెట్టడానికి కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానం పెద్ద వైఫల్యమని, అక్కడ ఎన్‌కౌంటర్లు, దాడులు జరుగుతున్నాయని, బీజేపీ ప్రభుత్వం చెప్పిన శాంతి, సాధారణ పరిస్థితులు ఆ రాష్ట్రంలో ఎక్కడా కనిపించడం లేదని రాజా చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు విధేయత చాటుకుందని, ప్రజల తక్షణ సమస్యల గురించి పట్టించుకోలేదని, ముఖ్యంగా నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టేందుకు, విద్య, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించలేదని ఆయన విమర్శించారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారిందని చెబుతున్న ప్రధాని మోదీ... దేశంలో ఉచితంగా రేషన్ ఇచ్చే పరిస్థితి ఎందుకు వచ్చిందో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అదానీ సంస్థలలో భాగస్వామ్యం కలిగిన సెబీ చైర్‌పర్సన్‌ను ఆ పదవి నుంచి తప్పుకోవాలని మోదీ ఎందుకు కోరడం లేదని, ఈ మొత్తం వ్యవహారంపై జేపీసీ ఏర్పాటుకు ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యంత దారుణమైన ఘటన జరిగిందని, దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా మోదీ మౌనం వీడి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులు, వైద్య సంస్థల్లో వైద్యులు, సిబ్బంది భద్రత, రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని రాజా డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు, సామాజిక న్యాయాన్ని ఎత్తి వేసేందుకు బీజేపీ ప్రభుత్వం

- మిగతా 2 లో

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి: కూనంనేని

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నదని, గత ప్రభుత్వం సృష్టించిన సంక్షోభాల నుండి ఇప్పటికీ బయట పడలేకపోతున్నదని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణమాఫీ, గృహ జ్యోతి, గ్యాస్ సబ్సిడీ అందరికీ అందేలా చూడాలని, ఇలాంటి విషయాలపై ప్రజా వ్యతిరేకత కూడగట్టుకోవద్దని కోరుకుంటున్నామని, మిత్రపక్షంగా తాము సూచనలిస్తామని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, బీజేపీ రాకూడదని, కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండాలని తాము కోరుకుంటున్నామని అన్నారు.

సీపీఐని పోరాట పార్టీగా నిలబెట్టేందుకు హనుమకొండలో రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ప్రజాసమస్యలపై చర్చించి, పార్టీపరంగా శ్రేణులను ఎలా కదిలించాలన్న విషయాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 11 నుండి 19 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు.

కోల్‌కతా వైద్యురాలి హత్యోదంతంపై విచారణ

కేసు నమోదుకు ముందే శవపరీక్షా?

- కోల్‌కతా పోలీసుల తీరుపై సుప్రీం ఆగ్రహం
- కేసు రాసిన అధికారి కోర్టుకు రావాలి
- ఆందోళన చేస్తున్న వైద్యులు, సిబ్బంది విధుల్లో చేరాలని ఆదేశం
- క్రైమ్ సీన్ మార్చేశారు: సీబీఐ

న్యూఢిల్లీ: ఆర్జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలి హత్య ఘటనపై కోల్‌కతా పోలీసుల వ్యవహార శైలిని సుప్రీంకోర్టు తప్పు బట్టింది. అసహజ మరణంగా కేసు నమోదు చేయడంలో పోలీసులు జాప్యం చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సుప్రీంకోర్టు పేర్కొంది. కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీం కోర్టు, గురువారం మరోసారి విచారణ చేపట్టింది. విచారణ ప్రారంభం కాగానే... ఆందోళన చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందిని వెంటనే విధుల్లో చేరాలని సూచించింది. విధుల్లోకి చేరిన తర్వాత వారిపై అధికారులు చర్యలు తీసుకోకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చింది. వైద్యులు విధులు నిర్వర్తించకపోతే రోగులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని

- మిగతా 2 లో

యుద్ధ క్షేత్రంలో పరిష్కారం లభించదు

శాంతి స్థాపనకు కట్టుబడి ఉన్నాం: మోదీ, టస్క్

వార్సా: యుద్ధాలు, ఘర్షణలు అంతం కావాలని భారత్, పోలాండ్ ప్రధాన మంత్రులు నరేంద్రమోదీ, డొనాల్డ్ టస్క్ ఉమ్మడిగా పిలుపునిచ్చారు. యుద్ధక్షేత్రంలో ఏ సమస్యకు పరిష్కారం లభించదని ఇద్దరు అధినేతలు ఒకే బాణీ వినిపించారు. తమ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నవీకరిస్తున్నట్లు ప్రకటించారు. పోలాండ్ రాజధాని వార్సాలోని ఛాన్సలరీలో పెట్టుబడులు, వాణిజ్య సంబంధాలను మెరుగుపర్చుకోవడంతో పాటు అంతర్జాతీయ, ప్రాదేశిక అంశాలపై ఇద్దరు ప్రధానులు చర్చించారు. పెట్టుబడులు, వాణిజ్యంపైనా పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని నిర్ణయించారు. మేకిన్ ఇండియాలో భాగస్వామి కావాలని పోలాండ్ ప్రధానిని మోదీ

- మిగతా 2 లో

మృతుల కుటుంబాలకు
కోటి పరిహారం

- గాయపడ్డవారికి రూ.50 లక్షలు
- అచ్యుతాపురం సెజ్ ఘటనపై ఉన్నతస్థాయి కమిటీ విచారణ
- తప్పు చేసినవారిపై కఠిన చర్యలు
- సీఎం చంద్రబాబు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: అచ్యుతాపురం సెజ్ ఘటనపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. గురువారం ఉదయం ఉండవల్లి నుంచి విశాఖపట్నం వచ్చిన సీఎం నేరుగా మెడికవర్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులతోనూ మాట్లాడి త్వరగా కోలుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భయపడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం కేజీహెచ్ ఆస్పత్రిలో కూడా క్షతగాత్రులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆ తర్వాత ఆస్పత్రి వెలుపల సీఎం మీడియాతో మాట్లాడారు. ప్రమాద ఘటన జరిగిన పరిశ్రమలో లోపాలపై ఉన్నతస్థాయి కమిటీ విచారిస్తుందని, నివేదిక వచ్చాక ఎవరు తప్పుచేసినా కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ కోసం కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసి, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిశ్రమల్లో ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, ఇక్కడ నిబంధనల మేరకు ఎస్‌వోపీ అనుసరించలేదని తెలుస్తోందన్నారు. పరిశ్రమలో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలు చేపట్టకపోవడం వల్లే ఘోర ప్రమాదం జరిగిందన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50లక్షలు, గాయపడిన వారికి రూ.25లక్షలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని,

- మిగతా 2 లో

సింథటిక్ ఉడ్, హైడ్రో ఫాయిల్ బోట్లు సహకరిస్తామని మంత్రి జనార్దన్‌రెడ్డి హామీ 6లో

ఇదీ లోకం!

ఇంక, నీ బతుకంతా పండగే!

మృత్యుకుహరాలు... పారిశ్రామికవాడలు

డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి

ప్రభుత్వాల మద్దతుతోనే ప్రైవేటు పారిశ్రామిక రంగం మృత్యుకుహరంగా మారుతున్నది. కార్మికుల ప్రాణాలు పణంగా పెట్టిన కంపెనీలు తమ లాభార్జనకు తెరలేపుతున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించడానికి కొంత మొత్తాన్ని ఖర్చు చేయాలి. లాభాల ధ్యాస తప్ప ఇంకేమీ పట్టని యాజమాన్యాల తీరు... వసూళ్లకు అలవాటు పడ్డ అధికారుల నిర్లక్ష్యం కలిసి నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా... కార్మికుల ప్రాణాలు పోతున్నా యాజమాన్యాలకు, అధికారులకు కనువిప్పు కలుగడం లేదు. ఇందుకు తాజా నిదర్శనమే అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో చోటుచేసుకున్న ఘోరమైన ప్రమాదం. సెజ్‌లో ఏర్పాటు చేసిన అనేక ఫార్మా కంపెనీల్లో ఎసెన్షియా కంపెనీ ఒకటి. ఇందులో బుధవారం సంభవించిన దారుణంలో ఏకంగా 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరిస్థితిని చూస్తే అర్థమవుతున్నది. ఇప్పటి వరకూ జరిగిన ఫార్మా ప్రమాదాల్లో ఇదే అత్యంత విషాదకరమైనది, అతి పెద్దది. అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో ఇది తొలి ప్రమాదమేమీ కాదు. ఈ సెజ్‌లో వరుసగా విషవాయుల లీకేజీ ఘటనలు వెలుగు చూశాయి. బ్రాండిక్స్ వస్త్ర పరిశ్రమలో 2022 జూన్ 3న లీకైన విషవాయువు కార్మికుల భద్రతను ప్రశ్నార్థకంగా మార్చింది. గత పదేళ్ల కాలంలో పదుల సంఖ్యలో దారుణాలు చోటుచేసుకున్నాయి. సదరు సెజ్‌లో సంభవిస్తున్న ప్రమాదాలను తలచుకుంటే కార్మికవర్గం వెన్నులో వణుకు పుడుతున్నది. తాజాగా జరిగిన ప్రమాదమే చివరిది అవుతుందని ఎవరూ హామీ ఇవ్వలేని స్థితి ఉన్నది.

అభివృద్ధి పరిశ్రమలు, కంపెనీల స్థాపన ద్వారానే సాధ్యమనేది ప్రభుత్వాల మాట. అభివృద్ధి మాటున వ్యవస్థలోని లోపాలను అడ్డం పెట్టుకొని నెలకొల్పుతున్న కొన్ని పరిశ్రమలు కార్మికుల ప్రాణాలు తీసేస్తున్నా అవేమీ అధికార యంత్రాంగానికి పట్టడం లేదనేది సుస్పష్టం. వరుసగా పారిశ్రామిక ఉపద్రవాలు సంభవిస్తున్నా ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు కూడా ఉండడం లేదు. ఘోరమైన ప్రమాదాలు జరిగి పెద్దఎత్తున ప్రాణాలు కోల్పోతే హుటాహుటిన ఏవో చర్యలు చేపట్టినట్టు నటిస్తున్న సందర్భాలే అధికం. బాధిత కుటుంబాలకు అరకొర సాయం అందించి చేతులు దులుపుకుంటున్న పరిస్థితే ఉన్నది. అభివృద్ధి మంత్రం జపిస్తూ ప్రభుత్వమే రైతాంగం నుంచి, ఇతర ప్రభుత్వ అధీనంలో ఉన్న స్థలాలను సమీకరించి భూ బ్యాంకు సిద్ధం చేసి పారిశ్రామిక అభివృద్ధి పేరుతో బడా కార్పొరేట్, ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం షరా మామూలైంది. అచ్యుతాపురం సెజ్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఎటువంటి కంపెనీలు పెడుతున్నారో, అందులో ఏమి ఉత్పత్తి అవుతుందో, దానికోసం వినియోగించే ముడిసరుకులు, రసాయనాలు ఏమిటో, వాటి వలన జరిగే నష్టం ఏమిటో ప్రభుత్వ పెద్దలకు తెలియడం లేదు. కర్మాగారాల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు కేవలం పేపర్లకే పరిమితమవుతున్నాయి. ఏటా జరిగేవి తూతూ మంత్రపు తనిఖీలే. లాభార్జన, శ్రామిక హక్కులకు, చట్టాలకు సెజ్‌లలో విలువ ఉండదు. కనీస వేతనాలు అనే మాటే అక్కడ వినపడదు. శ్రమ దోపిడీ ఇరుసుగా పనిచేసే ఆ కంపెనీలే మృత్యుకుహరాలుగా మారుతున్నాయి.

తొలినాళ్లలో ప్రభుత్వ రంగంలోనే ప్రారంభమైన పరిశ్రమల కారణంగా విశాఖపట్నం పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందింది. అటువంటి నగరం

- మిగతా 2 లో

హసీనా దౌత్య పాస్‌పోర్టు రద్దు

ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనాకు పెద్దఎదురుదెబ్బ తగిలింది. ఆమె దౌత్య పాస్‌పోర్టును రద్దు చేస్తూ బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన ఈ దౌత్య పాస్‌పోర్టులు రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ఆగస్టు 5 నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు దేశాధ్యక్షుడు పార్లమెంటును రద్దు చేశారు. తాత్కాలిక పరిపాలన యంత్రాంగానికి యూనస్ సారథిగా నియమితులయ్యారు. ఈ ప్రభుత్వమే పాస్‌పోర్టులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దాంతో ఆమెకు దౌత్యపరంగా ఉన్న అన్ని వెసులుబాట్లు రద్దయ్యాయి. ఆ పాస్‌పోర్టు వల్లే ఆమె బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. బంగ్లాలో చోటుచేసుకున్న హింసాకాండకు సంబంధించి హసీనాపై హత్య అభియోగాలు సహా అనేక కేసులు నమోదయ్యాయి. ఈ విషయంలో విచారణ జరిపేందుకు హసీనాను తమ దేశానికి అప్పగించాలని తాజాగా బీఎన్‌పీ సెక్రటరీ జనరల్ మీర్జా ఫఖ్రుల్ ఇస్లామ్ ఆలంగిర్ డిమాండు చేశారు.

బైడెన్ ఫోన్... తలొగ్గని నెతన్యాహు

వాషింగ్టన్: గాజాలో వీలైనంత వేగంగా కాల్పుల విరమణ జరిగేలా చర్యలు చేపట్టేందుకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ రంగంలోకి దిగారు. మరోవైపు ఇజ్రాయిల్ ప్రధాని మాత్రం కొన్ని డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఫిలడెల్ఫీ కారిడార్ నుంచి సేనలను వెనక్కి తీసుకొనే విషయంలో ఆయన మొండికేస్తున్నట్లు ప్రధాని కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే నెతన్యాహు... అమెరికా అధ్యక్షుడికి చాలా హామీలు ఇచ్చినట్లు వచ్చిన కథనాలను ఖండించాయి. బైడెన్ బుధవారం ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహుకు ఫోన్ చేసి చర్చలు జరిపారు. ఇటీవల ఓ ఒప్పందం కుదురుతుందని అంతా భావించినా... అది కొలిక్కి రాలేదు. తాజాగా బైడెన్ సంభాషణ వివరాలను శ్వేతసౌధం వెల్లడిస్తూ 'వీలైనంత తొందరగా కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందానికి రావాలని నొక్కి చెప్పారు. దీంతోపాటు ఈజిప్టు రాజధాని కైరోలో జరగనున్న చర్చ మిగిలిన సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించుకోవాలి' అని కోరినట్లు శ్వేతసౌధం పేర్కొంది. ఈ ఫోన్‌కాల్ మధ్యలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా పాలుపంచుకున్నట్లు వెల్లడించింది. తాజా సంక్షోభంలో ఇరాన్, హమాస్, హెజ్‌బొల్లా నుంచి ఇజ్రాయిల్‌కు రక్షణపరంగా అమెరికా చేస్తున్న సాయంపైనా ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారు. ఈ ఫోన్‌కాల్‌పై నెతన్యాహు కార్యాలయం నుంచి మాత్రం ఎటువంటి ప్రకటన రాలేదు. మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ గత వారం ఈ ప్రాంతంలో పర్యటించి హమాస్-ఇజ్రాయిల్ మధ్య ఒప్పందం కుదిర్చేందుకు చర్చలు జరిపారు. తమ ప్రతిపాదనలకు నెతన్యాహు మద్దతుగా నిలిచారని ఆయన ప్రకటించారు.

ఎన్నికలకు రాబర్ట్ కెన్నడీ జూనియర్ దూరం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు నుంచి స్వతంత్ర అభ్యర్థి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ వైదొలగనున్నారు. ఈ విషయాన్ని గురువారం అమెరికా మీడియా సంస్థలు న్యూయార్క్‌టైమ్స్, సీఎన్‌ఎన్ వెల్లడించాయి. ప్రస్తుతం కెన్నడీకి దేశవ్యాప్తంగా 8.7 శాతం ఓటర్ల మద్దతు ఉన్నట్లు ది హిల్ పత్రిక నిర్వహించిన సర్వే పేర్కొంది. ఆయన భవిష్యత్తులో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు మద్దతు ఇవ్వనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్‌లో ట్రంప్-హారిస్ మధ్య తీవ్రమైన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా కెన్నడీ మద్దతు ఆయనకు లభించడంతో స్వింగ్ స్టేట్స్‌లో ఎన్నికల ఫలితాలను ఇది ప్రభావితం చేసే అవకాశం ఉంది.

ఇక సచివాలయ ఉద్యోగుల వంతు

(మొదటిపేజీ తరువాయి)

ఖండిస్తున్నారు. ఉత్తర్వులు వెనక్కి తీసుకోకుంటే ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమలో అర్హులైన వారిని విద్యాశాఖలోకి తీసుకోవాలని, నాన్ టీచింగ్ సిబ్బందిగా నియమించాలని కోరారు.

రాష్ట్రంలో 15వేల గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా లక్షా 40వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రతి సచివాలయానికి ఒకరు చొప్పున అంటే 15వేల మంది విద్యా సంక్షేమ కార్యదర్శులను గత ప్రభుత్వం నియమించింది. ముగిసిన విద్యా సంవత్సరం వరకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులే వంతుల వారీగా టాయిలెట్ల ఫోటోలు తీసి, అప్‌లోడ్ చేసేవారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఈ పని నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగింది. ఈ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు స్వాగతించాయి. దీంతో పాఠశాలల యాజమాన్య కమిటీ (సీఎంసీ)ల ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారిలో 90 శాతం మంది టీడీపీ సానుభూతిపరులే ఉన్నారు. టాయిలెట్ల ఫోటోలు తీసే బాధ్యతను సీఎంసీ కమిటీ సభ్యులకు అప్పగించాలని తొలుత నిర్ణయించిన పాఠశాల విద్యాశాఖ తర్వాత నిర్ణయం మార్చుకొని సచివాలయాల సంక్షేమ విద్య కార్యదర్శులకు బాధ్యత అప్పగించింది.

చెత్త పన్నుల నుంచి టాయిలెట్ల ఫోటోల వరకు...

వైసీపీ హయాంలో ఏర్పాటైన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు జరిగింది. ఇంటి ముగింటకే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా సేవలు అందాయి. ఉద్యోగుల సమస్యల్ని గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. వాటిని సీఎంఓలోని ఉన్నతాధికారుల దృష్టికి గ్రామ, వార్డు సచివాలయాల సంఘం నేతలు తీసుకెళ్లినా, అవి అప్పటి సీఎం జగన్ వద్దకు చేరలేదన్న వాదనలున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల వ్యవస్థ రద్దు అయింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతో ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యావంతులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను జాబ్ చార్ట్ ప్రకారం కాకుండా, రోజు వారీ కూలీల మాదిరిగా ప్రతి పనికీ ఎడా పెడా వినియోగిస్తోంది. సచివాలయ ఉద్యోగులను చులకన చేసే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో సులభ్ కంప్లెక్స్‌లు, పార్కులు, చెత్త పన్నులు తదితర వసూలుకు ఈ ఉద్యోగులను వినియోగించగా, ఇప్పుడు పాఠశాలల టాయిలెట్ల ఫోటోలు తీయాలని పురమాయించడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఐదేళ్ల నుంచి కొంతమంది ఉద్యోగులను అధికారులు వేధిస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి టాయిలెట్ల ఫోటోలు తీసే బాధ్యత నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు.

కేసు నమోదుకు ముందే శవపరీక్షా?

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు వ్యాఖ్యానించింది. వైద్యుల ఆందోళనతో పేదలు నష్టపోకూడదని పేర్కొంది. 'వైద్యం కోసం వస్తున్న పేదలను విస్మరించలేం. మీ ఆందోళన కారణంగా పేదలు నష్టపోకూడదు. మీరు వెంటనే విధుల్లో చేరండి. మీరు విధుల్లో చేరిన తర్వాత మీపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూస్తాం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టంచేసింది. కాగా ఈ కేసు దర్యాప్తుపై పురోగతిని వివరిస్తూ... సీబీఐ సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది. ఇందులో కీలక విషయాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. తాము వెళ్లేసరికి క్రైమ్ సీన్ మొత్తాన్ని మార్చేశారని సీబీఐ ఆరోపించింది. "ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన 5 రోజుల తర్వాత దర్యాప్తును సీబీఐకి అప్పగించారు. దీంతో ఇప్పుడు దర్యాప్తు సవాల్‌గా మారింది. మేం ఐదు రోజుల తర్వాత ఘటన జరిగిన ఆసుపత్రికి వెళ్లేసరికి క్రైమ్ సీన్‌ను మార్చినట్లు గుర్తించాం. ఇక బాధితురాలి దహన సంస్కారాలు పూర్తి చేసిన తర్వాత అర్ధరాత్రి సమయంలో ఎఫ్ఐఆర్ నమోదుచేయడం దిగ్భ్రాంతికరం. తొలుత ఆమెది ఆత్మహత్య అని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారని అనుమానించిన బాధితురాలి సహోద్యోగులు, యువ వైద్యులు వీడియోగ్రఫీ కోసం పట్టుబట్టారు. దీంతో అప్పుడు పోస్ట్‌మార్టంను వీడియో తీశారు" అని సీబీఐ కోర్టుకు వివరించింది. సీబీఐ నివేదికను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలించింది. ఈసందర్భంగా కోల్‌కతా పోలీసుల తీరుపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కేసు నమోదులో లోపాలపై ప్రశ్నల వర్షం కురిపించింది. "బాధితురాలు తీవ్ర గాయాలతో అర్ధనగ్న స్థితిలో విగతజీవిగా కన్పించింది. అయినా ఆమెది అసహజ మరణం అని రికార్డుల్లో ఆలస్యంగా నమోదుచేయడం తీవ్ర ఆందోళనకరం. అంతేగాక.. అసహజ మరణం అని నమోదు చేయడానికి ముందే పోస్ట్‌మార్టం నిర్వహించడం ఆశ్చర్యంగా ఉంది. శవపరీక్ష జరిగిన 18 గంటల తర్వాత క్రైమ్ సీన్‌ను సీల్ చేశారెందుకు?" అని కోర్టు ప్రశ్నించింది.

ఈ కేసులో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తీరు అనుమానాస్పదంగా ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసును తొలుత రికార్డుల్లో రాసిన పోలీసు అధికారి తదుపరి విచారణకు కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. నిందితుడి వైద్య రిపోర్ట్‌ను కూడా సమర్పించాలని సీబీఐకి సూచించింది. కేసు నమోదులో కోల్‌కతా పోలీసులు ప్రదర్శించిన నిర్లక్ష్యంపై సుప్రీంకోర్టు పెదవి విరిచింది. గత 30 ఏళ్లలో ఇలాంటి లోపాలను చూడలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా పోలీసుల తరఫు న్యాయవాదులపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా తరహా వాదనలు ఇక్కడ చేయొద్దని హెచ్చరించింది. ఈ కేసులో ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కొన్ని కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలు చేస్తున్నవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ఆందోళన చేస్తున్న వైద్యులు తిరిగి విధుల్లో చేరాలని సూచించింది. విధుల్లో చేరిన తర్వాత వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అధికారులను సూచించింది. ఇక, నిందితుడికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేలా శుక్రవారం లోగా ఆదేశాలివ్వాలని కోల్‌కతా కోర్టుకు తెలిపింది. వైద్యుల భద్రత కోసం ఏర్పాటుచేసిన జాతీయ టాస్క్‌ఫోర్స్‌కు సూచనలు చేసేందుకు ఓ ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటుచేయాలని వైద్యారోగ్య సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది. వైద్యుల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యల కోసం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులు, పోలీసు అధికారులతో చర్చలు జరపాలని పేర్కొంది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 5వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రముఖ న్యాయవాది కపిల్‌సిబల్ నేతృత్వంలోని 21 మంది న్యాయవాదుల బృందం పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తుండగా... సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అధ్వర్యంలో ఐదుగురు న్యాయవాదుల బృందం కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తోంది.

కోటి పరిహారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి అభయమిచ్చారు. గత ఐదేళ్లలో విశాఖలో 119 ఘటనల్లో 120 మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో వెంటనే అంతర్గత విచారణ చేపట్టాలని, రెడ్ కేటగిరిలోని పరిశ్రమలన్నీ కచ్చితంగా ఎస్‌వోపీని పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫార్మా కంపెనీలో జరిగిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ప్రమాదంలో 17 మంది మరణించగా, 36 మందికి గాయాలయ్యాయన్నారు. క్షతగాత్రుల్లో 10 మంది తీవ్రంగా, 26 మంది స్వల్పంగా గాయపడ్డారని, ఎంత ఖర్చు అయినా బాధితులందరికీ ఆధునిక వైద్య సేవలందిస్తామన్నారు. అవసరమైన వారికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయిస్తామన్నారు. గడిచిన ప్రభుత్వం వ్యవస్థలను సర్వనాశనం చేశారని, అవన్నీ బాగుచేసే కార్యక్రమంలో ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధేస్తోందన్నారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుంచి తెలుసుకున్నాను. ప్రమాదంలో గాయపడిన అందరినీ కలిసి వారితో మాట్లాడాను. వారితో ఒకటే చెప్పాను. ధైర్యంగా ఉండాలని బాధితులకు భరోసా ఇచ్చాం. ఎన్నిరోజులైనా పర్వాలేదు ప్రభుత్వం అన్నీ చూసుకుంటుందని చెప్పాం. వీరిలో ఒకరికి 57 శాతం కాలిన గాయాలయ్యాయి. అతనితో కూడా మాట్లాడాను చాలా ధైర్యంగా ఉన్నాడు. మరొకరికి 24 శాతం, ఇంకొకరికి 12 శాతం, మరొకరికి 10 శాతం కాలిన గాయాలయ్యాయి. ఒకరు ప్రమాదం జరిగిన షాక్ లో ఉన్నారు. ఆయన కూడా ఇప్పుడిప్పుడే రికవరీ అవుతున్నారు. బాగానే ఉన్నారు. డాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం.. ఎట్టిపరిస్థితుల్లో వైద్యం విషయంలో రాజీపడొద్దని చెప్పాం. అన్నివిధాల మానిటరింగ్ చేస్తున్నాం. విశాఖపట్నం నాకు మనస్సుకు దగ్గరైన సిటీ. హుద్‌హుద్ సమయంలో మేం ఏవిధంగా చేశామో అందరూ చూశారు. ఇలాంటి సిటీ విషయంలో సేఫ్టీ మెజర్స్ అంతా ప్రక్షాళన చేయాలి. భవిష్యత్‌లో ఎలాంటి సంఘటన జరగకూడదని ఆలోచించే సమయంలో ఒక దురదృష్టకరమైన, బాధాకరమైన సంఘటన జరిగింది. దీన్ని ఇదే చివరిది కావాలని నేను కోరుకుంటున్నా. బాధితులను చూశాక, వారి ధైర్యం చూశాక వెంటనే కోలుకుంటారనే ఆశాభావం నాకు కలిగింది. మీడియా కూడా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజలకు, కుటుంబసభ్యులకు అండగా ఉన్నామనే ధైర్యం కలిగించాలి. మళ్లీ వారిని మామూలు వ్యక్తులుగా తయారు చేయాలి. మేనేజ్‌మెంట్‌లో ఏమైనా అవకతవకలు జరిగి ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. వైసీపీ తప్పుడు పనులు చేసి తమను విమర్శిస్తోందని, అది ముమ్మాటికీ చేతగానితనమేనని చంద్రబాబు మండిపడ్డారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చి 60 రోజులే అయిందని, ఈ ఘటనకు కారణం ఎవరని ప్రశ్నించారు.

యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం..

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ లైఫ్ సైన్సెస్ ప్రమాదంపై థర్డ్ పార్టీ కీలక నివేదికను వెలువరించింది. ఈ ప్రమాదం వెనుక యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం ఉందని థర్డ్ పార్టీ పేర్కొంది. గత ఏడాది ఇచ్చిన నివేదికలోనే సంస్థలో లోపాలను థర్డ్ పార్టీ నివేదిక ఎత్తి చూపించింది. పైప్ లైన్‌ను తరచూ తనిఖీ చేసే సిస్టమ్ వెంటనే ఫ్యాక్టరీలో ఏర్పాటు చేయాలని థర్డ్ పార్టీ నివేదిక గతంలోనే పేర్కొంది. అయినా సరే.. ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోలేదు. థర్డ్ పార్టీ నివేదికను అమలు చేయాలని కనీసం ఫ్యాక్టరీ యాజమాన్యానికి సైతం ప్రభుత్వ అధికారులు చెప్పలేదని తెలుస్తోంది. పైప్ లైన్ నుంచి బుధవారం మధ్యాహ్నం సాల్వెంట్ లీక్ అయ్యింది. ఫ్యాక్టరీలోని మొత్తం పైప్ లైన్ నుంచి సాల్వెంట్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు అలుముకున్నాయి.

బీజేపీకి గుణపాఠం తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

కుట్రలు చేస్తున్నదని ఆయన విమర్శించారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ కుట్రతో రెజ్లర్ వినేశ్ ఫొగాట్ బలైందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేసిన సీపీఐ ఒక ఎంఎల్ఏ స్థానంలో విజయం సాధించిందని, రెండు ఎంఎల్‌సీ పదవులు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్... ఇంకా అధికారికంగా ప్రకటించలేదని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు.

యుద్ధక్షేత్రంలో పరిష్కారం లభించదు

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. భారత్‌లో తయారు చేసిన వస్తువుల ఎగుమతులకు పోలాండ్ సహకారాన్ని కోరారు. ఆపై ఉమ్మడిగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలో యుద్ధాలు అంతం కావాలని ఆకాంక్షించారు. మోదీ మాట్లాడుతూ 'యుద్ధ క్షేత్రంలో పరిష్కారాలు లభించవని భారత్ గట్టిగా నమ్ముతోంది. ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కలచివేస్తున్నాయి. ఈ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి' అని అన్నారు. శాంతి స్థాపనకు భారత్ కటుబడి ఉందని మోదీ చెప్పారు. అమాయకుల ప్రాణాలు కోల్పోతుండటం మానవాళికి పెద్ద సవాల్‌గా నిలిచిందన్నారు. సంప్రదింపులు, దౌత్య మార్గాల్లో శాంతి, సుస్థిరత సాధ్యమని, అందుకు తమ మిత్రదేశాలకు భారత్ పూర్తిగా మద్దతిస్తుందని మోదీ వెల్లడించారు. మోదీతో ఏకీభవించిన టస్క్ మాట్లాడుతూ ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనున్నట్లు నమ్ముతున్నామని చెప్పారు. 'ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని తక్షణమే ఆపేందుకు, శాంతి నెలకొల్పేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రధాని మోదీ అన్నారు. భారత్ ముఖ్యమైన, సానుకూలమైన పాత్ర పోషించగలదని మేము నమ్ముతున్నాం. ఈ ప్రకటన కీలకమైనది' అని ఆయనన్నారు. ఉక్రెయిన్ పర్యటన కోసం మోదీకి శుభాభినందనలు తెలిపారు. 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ మీరు పది గంటలు ప్రయాణించి ఉక్రెయిన్ వెళతారు. ఈ పర్యటన చారిత్రకమవుతుందని విశ్వసిస్తున్నా' అని మోదీని ఉద్దేశించి టస్క్ అన్నారు.

11 రోజుల తర్వాత విధుల్లోకి...

(మొదటిపేజీ తరువాయి)

వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలిగిన దృష్ట్యా తిరిగి విధులకు హాజరు కావాలన్న సుప్రీం విజ్ఞప్తితో ఈ మేరకు నిర్ణయించినట్లు వెల్లడించారు. 'మమ్మల్ని నమ్మండి, తిరిగి విధులకు హాజరుకండి' అని సుప్రీంకోర్టు కోరడంతో వైద్యులు సమ్మె విరమించినట్లు రెసిడెంట్ డాక్టర్ల సంఘం (ఆర్‌డీఏ) వెల్లడించింది. ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆసుపత్రి ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపింది. వైద్య వృత్తిదారులకు భద్రతపై సానుకూలన స్పందనను అభినందించింది. నిరసనల్లో పాల్గొన్న వైద్యులపై చర్యలు ఉండవని ఆర్‌డీఏ ప్రకటించింది. హెల్త్‌కేర్ వర్కర్ల భద్రత, హక్కుల కోసం వివిధ అధికారులు, మంత్రిత్వశాఖలతో సంప్రదింపులను కొనసాగిస్తామని వెల్లడించింది. సుప్రీంకోర్టు సూచనలను కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆర్‌డీఏ విజ్ఞప్తి చేసింది.

అల్‌ఖైదా 'ఖిలాఫత్' కుట్ర భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

ఆపరేషన్ చేపట్టి ఖిలాఫత్ కుట్రను భగ్నం చేసినట్లు ఒక ప్రకటన వెలువరించారు. ఖిలాఫత్‌ను ప్రకటించి వరుసపెట్టి ఉగ్రవాద చర్యలు చేపట్టాలని కొందరికి సాయుధ శిక్షణ ఇస్తున్నట్లు పక్కా సమాచారం ఉండటంతో తనిఖీలు చేపట్టి అరెస్టులు చేసినట్లు వెల్లడించారు. 'జార్ఖండ్ రాజధాని రాంచీలోని డాక్టర్ ఇష్తియాక్ నాయకత్వంలో ఉగ్ర కార్యకలాపాలను ఈ మాడ్యూల్ సాగిస్తోంది. ఖిలాఫత్ ప్రకటించి దేశంలో తీవ్రమైన ఉగ్ర చర్యలు చేపట్టాలని లక్ష్యం పెట్టుకుంది' అని ప్రకటన వెల్లడించింది. టెర్రర్ మాడ్యూల్ సభ్యులకు ఆయా రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో సాయుధ శిక్ష ఇస్తున్నారన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఢిల్లీ పోలీసులు, సాయుధ దళాలు కలిసి అనుమానిత ప్రాంతాలను జల్లెడ పట్టినట్లు పేర్కొంది. రాజస్థాన్‌లోని భివండిలో ఆరుగురు, జార్ఖండ్, యూపీ నుంచి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించినట్లు తెలిపింది. తనిఖీలు జరిపిన ప్రాంతాల నుంచి ఉగ్ర సాహిత్యం, ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. మరిన్ని సోదాలు-అరెస్టులు కొనసాగుతాయని, ప్రస్తుతానికి ఈ వ్యవహారంలో దర్యాప్తు జరుగుతోందని ఢిల్లీ పోలీసు అధికారులు తెలిపారు.

కశ్మీర్‌లో పొత్తుకు 'సై'

(మొదటిపేజీ తరువాయి)

వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... "ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత ఏర్పాటుచేసిన తొలి సమావేశం ఇదే. ఎన్నికలు, పొత్తుల కోసం స్థానిక కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకొనేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేశాం. రాహుల్ గాంధీ నాయకత్వంలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు యత్నిస్తాం. ఆ దిశగా ప్రయతాలు చేస్తామని మేం హామీ ఇస్తున్నాం. ఇక ఇతర పార్టీలతో కలిసి ఎన్నికల బరిలో దిగేందుకు రాహుల్ కూడా ఆసక్తిగా ఉన్నారు" అని వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఒక నియంతను అధికారంలోకి రాకుండా ఇండియా ఐక్యసంఘటన ఆపగలిగిందని ఖర్గే పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ ఆందోళనలో ఉందని ఖర్గే అభిప్రాయపడ్డారు. దీంతో కొన్ని బిల్లులను పాస్ చేయడంలో అప్రమత్తంగా ఉండటమో... వాటిని వెనక్కు తీసుకోవడమో లేదా జేపీసీకి పంపడమో చేస్తోందని వెల్లడించారు. రైతు చట్టాలు వంటి బిల్లులను ఆమోదించేందుకు బీజేపీ తమ మెజార్టీని వాడుకుందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ విషయంలో ఎన్నికల ముందు ఈ ప్రాంత ప్రజలకు బీజేపీ ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఖర్గే విమర్శిం చారు. కాషాయ పార్టీ ఒకప్పటి రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా తగ్గించిందని, ఇక్కడి ప్రజలకు ఎలాంటి హక్కులు కల్పించలేదని, శాసన మండలి, పంచాయతీ, మున్సిపాలిటీ లేవని అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రజలు దూరంగా ఉంచబడ్డారని ఖర్గే పేర్కొన్నారు. సెప్టెంబరు 30లోగా ఎన్నికలు నిర్వహించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల కారణంగానే జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను ప్రకటించారని తెలిపారు. ప్రజల గొంతును అణచివేయడంలో ఎంతమాత్రం విజయం సాధించలేరని, వారి ఆకాంక్షలను అణచివేయలేరని బీజేపీని ఉద్దేశించి ఖర్గే అన్నారు. కాంగ్రెస్ ప్రజలతో ఉంటూ... వారి ఆకాంక్షల కోసం పోరాడుతుందని తెలిపారు. కశ్మీర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పన, పెట్టుబడులు తీసుకురావడంతోపాటు ఉద్యాన, పర్యాటక రంగాలతో పాటు చిన్నతరహా పరిశ్రమలకు ఊతమిస్తుందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో శాంతి పునరుద్ధరణకు అన్ని లౌకిక శక్తులు కలిసి పనిచేస్తాయని ఖర్గే చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జమ్ము కశ్మీర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తారన్న విశ్వాసం తనకున్నదని చెప్పారు. ఎక్కడ, ఎప్పుడు ఎన్నికలు నిర్ణయించాలో బీజేపీ నిర్ణయిస్తున్నదని అన్నారు. బీజేపీకి దీటైన పోటీ ఇస్తున్న పార్టీ కావడంతోనే కాషాయ పాలకులు నిత్యం కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఒక్కరే బీజేపీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారని అన్నారు. దేశాన్ని కాపాడటంతో పాటు మీ సంస్కృతి, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయాలని ఖర్గే పిలుపు ఇచ్చారు.

కాంగ్రెస్‌తో పొత్తు ఖరారు...90 స్థానాల్లో పోటీ: ఫరూక్

మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులను కలిసిన తర్వాత పొత్తు విషయమై చర్చించేందుకు నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఇంటికి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెళ్లారు. ఫరూక్ అబ్దుల్లాతో పాటు పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాతో ఎన్నికల్లో పొత్తులపై చర్చించారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత ఫరూక్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడారు. విపక్ష ఇండియా ఐక్య సంఘటన మంచి ఊపుమీదుందని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగాను కాంగ్రెస్‌తో పొత్తు ఖరారు చేసుకున్నట్లు ప్రకటించారు. దేశంలోని విభజన శక్తులను ఓడించేందుకు నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ ఉమ్మడిగా పోరాడతాయని తెలిపారు. సీపీఎం కూడా తమతో కలిసి వస్తుందని... భారీ మెజారిటీతో విజయం సాధించడం ద్వారా ఇక్కడి ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు పాటుపడతామని అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర హోదానే ప్రాధాన్యమన్న రాహుల్ వ్యాఖ్యలపై స్పందిస్తూ... పూర్తి అధికారాలతో రాష్ట్ర పునరుద్ధరణ జరుగుతుందన్నారు.

మృత్యుకుహరాలు... పారిశ్రామికవాడలు

(మొదటిపేజీ తరువాయి)

క్రమంగా ప్రైవేటు పారిశ్రామికరంగం చేతుల్లోకి వెళుతోంది. ఇప్పటికే ప్రభుత్వ రంగంలో ఉన్న కొద్దో గొప్పో పరిశ్రమలు ఇపుడు ఉనికి కోల్పోతున్నాయి. విశాఖపట్నంలో ఎప్పుడు ఏ కర్మాగారంలో ఏ దారుణం జరుగుతుందో అనే భయం నెలకొన్నది. నగరం చుట్టూ ఉన్న పరిశ్రమలు, నగర శివార్లలో కొలువైన ఫార్మా కంపెనీలు ప్రాణాంతకంగా తయారయ్యాయి. వీటిలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉన్నది. వందల ప్రాణాలు పోతూనే ఉన్నాయి. ఇందులో బయటకు రాని ఘటనలే అధికం. విశాఖపట్నంలో 2020 మే నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలోనే నాలుగు భారీ పారిశ్రామిక ప్రమాదాలు చోటు చేసుకున్న విషయం అంత తేలికైనది కాదు. మే 7వ తేదీన చోటుచేసుకున్న ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదం చాలా తీవ్రమైంది. నగరంపై భారీస్థాయిలో విషవాయువులు చిమ్మింది. పోరస్ పరిశ్రమలోని ట్యాంకులో నిల్వ ఉంచిన స్టైరిన్ గ్యాస్ ఆవిరిగా మారి గాలిలో కలిసిపోయి వాతావరణంలోని ఆక్సిజన్‌ను హరించి ప్రజల ప్రాణాలు తీసింది. ఈ ఘోర ప్రమాదంలో ఒకేసారి 12 మంది, మరో ముగ్గురు చికిత్స పొందుతూ మొత్తం 15 మంది చనిపోయారు. 585 మంది ఊపిరాడక ఎక్కడికక్కడ కుప్పకూలిపోయారు. పాలిమర్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో నివాసమున్న వేలమంది ఇప్పటికీ నాటి విషవాయువుల ప్రభావానికి లోనవుతూనే ఉన్నారు. ఆల్కహాల్ మొలాసిస్ కోసం నిర్మించిన ట్యాంకులో స్టైరిన్‌ను నిల్వ చేయడంతోనే ఈ ఘోర పమాదం జరిగిందని విచారణలో స్పష్టమైనా... ఆ కంపెనీ నిర్వాహకులపై తీసుకున్న చర్యలు శూన్యం. అదే ఏడాది జూన్ 30న సాయినార్‌లో విషవాయువు లీక్ కావడంతో ఇద్దరు ఉద్యోగులు ఊపిరి వదిలారు. జులై 13న విశాఖనగరంలోని సాల్వెంట్స్‌లో రియాక్టర్ పేలడంతో ఇద్దరు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. కొద్ది రోజులకే హిందుస్థాన్ షిప్‌యార్డులో భారీ క్రేన్ కుప్పకూలి మరో 11 మంది చనిపోయారు. ఇన్ని వరుస దారుణలు జరిగినా తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి అనేది వేయి దాలర్ల ప్రశ్నగానే మిగిలింది.

35 ఏళ్ల కిందట భోపాల్ నగరాన్ని కమ్మేసిన యూనియన్ కార్బయిడ్ గ్యాస్‌లీక్ ఘటన నుంచి పాలకులు నేర్చుకున్న గుణపాఠం ఏమీ లేదు. వేలమంది ప్రాణాలు తీసిన ఆ ఘటన అనుభవం నుంచి ఇటువంటి దారుణ ప్రమాదాలు ఇకపై జరగకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించాల్సిన ప్రభుత్వాలు నాటి నుంచి నేటి వరకు పెట్టుబడిదారుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోయాయి. ఫలితంగా నేడు దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో సగటున నిత్యం నలుగురు ప్రాణాలు విడుస్తుండగా... 46 మంది క్షతగాత్రులు అవుతున్నారు. ఇవన్నీ అధికారిక గణాంకాలే. వాస్తవాలు ఇందుకు వందల రెట్లు ఉంటుందనేది బహిరంగ రహస్యమే.

పరిశ్రమల్లో జరుగుతున్న ఈ దారుణ ప్రమాదాల విషయంలో దేశంలోని కార్మిక సంఘాలతో పాటు అంతర్జాతీయ కార్మిక సమాఖ్య (ఐజీయూ) యాజమాన్యాలకు, ప్రభుత్వాలకు అనేక హెచ్చరికలు చేసినా 'దున్నపోతుపై వర్షం' చందంగానే మారుతున్నది. ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక విధానాలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నా... కబోది తత్వాన్ని కనపరుస్తున్నాయి. లేబర్ కోడ్ల రూపంలో కార్మికుల హక్కులను హరించి మరింత అన్యాయం చేస్తున్నాయి. ఇటు ప్రభుత్వం, అటు పరిశ్రమల యజమాన్యాలు... చట్టాలు తమకు పట్టని అంశాలుగా పరిగణించి తమ వ్యాపారాభివృద్ధి కోసం పని చేసుకుపోవడం గర్హనీయం. మరోవైపు ఏపీలోని సముద్ర తీరమంతా విషపూరిత రసాయన పరిశ్రమలకు అడ్డాగా మారే ప్రమాదం పొంచి ఉన్నది. కోస్టల్ కారిడార్ ముసుగులో ఈ తరహా ఫార్మా, ఇతర ప్రమాదకరమైన రసాయన పరిశ్రమలు వస్తాయనే భయం తీర ప్రాంత ప్రజల్లో కనిపిస్తున్నది. ఈ విషయంలోను ప్రభుత్వం జాగ్రత్త వహించకపోతే మరిన్ని ప్రమాదాలను కొని తెచ్చుకోవడమే అవుతుంది.

దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రమాదాల నివారణ, భద్రతల కోసం ఓకే రకమైన ప్రమాణాలను రూపొందించి కచ్చితంగా అమలు జరిపేలా చూడటం అత్యవసరంగా గుర్తించాలి. ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం కింద అందించాల్సిన ఆర్థిక భరోసా కూడా ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపైనే ఉంటున్నది. ప్రస్తుతం ఒక్కో ప్రమాదానికి, ఒక్కో ప్రాణానికి ఒక్కో రకమైన నష్టపరిహారం అమలులో ఉంటున్నది. అది కూడా బాధిత కుటుంబాలకు అందే వరకు నమ్మకం ఉండడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వమే కల్పించుకోవాలి. ఎటువంటి ప్రమాదంలోనైనా ప్రాణాలు కోల్పోతే ఆ యాజమాన్యమే న్యాయబద్ధంగా ఆ కుటుంబాన్ని ఆదుకునేలా నిర్దిష్టమైన మొత్తం అందించేలా చట్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉన్నది. పరిశ్రమ నెలకొల్పే ముందే ఆ మేరకు అంగీకారపత్రం ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. పని ప్రదేశాల్లో కార్మికుల భద్రతతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల భద్రతను ఆయా పరిశ్రమల యజమానులు తమ సొంత బాధ్యతగా చూసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు ప్రభుత్వ యంత్రాంగం కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలపై నిఘా పెట్టాలి. నిత్యం తనిఖీలు చేపట్టాలి. భద్రతా ప్రమాణాలను తనిఖీ చేసే అధికారుల్లో ప్రోదికొన్న నిర్లక్ష్యాన్ని వదలగొట్టి...ఇకపై ఏ పారిశ్రామిక ఉపద్రవం మానవ వినాశనానికి దారి తీయకుండా కఠినమైన నిబంధనలు అమలు జరిపే బాధ్యత తమపై ఉన్నదని ప్రభుత్వాలు గుర్తించాలి.

కలెక్టరేట్ల వద్ద 10న మహాధర్నాలు

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట నాయకుల ప్రకటన

విశాలాంధ్ర- విజయవాడ: విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించవద్దని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 10వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట మహాధర్నాలు చేపట్టనున్నట్లు విశాఖ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు తెలిపారు. స్థానిక దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ అధ్వర్యంలో 1290 రోజులుగా ఆందోళనలు జరుగుతున్నాయని, విశాఖ నగరంలోని అన్ని కార్మిక సంఘాలు 1250 రోజులుగా పోరాటం చేస్తున్నాయని చెప్పారు. ఇంత జరుగుతున్నా కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని అప్పటి జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వాలు కంటితుడుపు చర్యలు తీసుకోవటం తప్ప స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలపై చిత్తశుద్ధి కనిపించలేదని విమర్శించారు. ప్రైవేటీకరణ వద్దంటూ జగన్ ఏకవాక్య తీర్మానంతో సరిపెట్టారని, మోదీని గట్టిగా నిలదీయలేకపోయారని చెప్పారు. విశాఖ ఉద్యమాన్ని ఆపుచేయటానికి కేంద్రం దుష్ట ఆలోచనలు చేస్తున్నదన్నారు. జులై 23న కేంద్ర ఉక్కు శాఖమంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి ప్లాంట్ ప్రైవేటీకరణ ఉండదని హామీ ఇచ్చి... రూ.690 కోట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారని గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచి స్టీల్ ప్లాంట్‌లో ఒక బ్లాస్ట్ ఫర్నేస్ నిలిచిపోయిందని, కేంద్ర మంత్రి వచ్చి వెళ్లిన తరువాత మరో బ్లాస్ట్ ఫర్నేస్ నిలిచిపోయిందని తెలిపారు. ముడి సరుకు సరఫరా నిలిపేశారన్నారు. శాశ్వత ఉద్యోగులకు విడతల వారీగా జీతాలు చెల్లిస్తున్నారని, ఒప్పంద కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేన్నారు. స్టీల్‌ప్లాంట్ సహజ మరణానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వానికి అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంతో మాట్లాడాలని కోరారు. ముఖ్యమంత్రులు దిల్లీ వెళ్లిన ప్రతిసారి వేర్వేరు అంశాలు మాట్లాడుతున్నారు గాని విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి ప్రస్తావించటం లేదన్నారు. ఇలా చేయడం వల్ల జగన్‌మోహన్‌రెడ్డికి, చంద్రబాబు నాయుడుకు తేడా ఏమిటని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం చంద్రబాబు అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అచ్యుతాపురం సెజ్‌లో రియాక్టర్ పేలటానికి ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమని ధ్వజమెత్తారు. కంపెనీలకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చేసి చూసీచూడనట్లు వ్యవహరించటం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు యాజమాన్యం ఇచ్చే కోటి రూపాయలను ప్రభుత్వమే ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌తో చెప్పిస్తూ ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా చూసుకుంటున్నారని ఆరోపించారు. యాజమాన్యం కోటి రూపాయలు, ప్రభుత్వం మరో కోటి రూపాయలు మొత్తం రెండు కోట్ల రూపాయలను బాధిత కుటుంబాలకు ఆసుపత్రి వద్దే అందించాలని డిమాండ్ చేశారు. సెజ్‌లలో ప్రమాదాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులు 23వ తేదీ శుక్రవారం అచ్యుతాపురం ప్రమాద స్థలాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్మిక శాఖ అలసత్వంతో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ రానున్న రోజుల్లో కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం ముందు ధర్నా చేయనున్నట్లు చెప్పారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడతామని టీడీపీ, జనసేన అధికారంలోకి రాకముందు హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత పట్టించు కోవడం లేదన్నారు. పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, పర్యావరణ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఫ్యాక్టరీలలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్న ప్రభుత్వం... స్వచ్ఛంద పదవీవిరమణ చేసిన వారికి డబ్బులు ఇస్తామని చెప్పటంతో ప్రభుత్వం కుట్రలు అర్థమవుతున్నాయని చెప్పారు. ముందుగా రియాక్టర్ పేలిన ఘటనలో మృతిచెందిన కార్మికులకు నాయకులు తీవ్ర సంతాపం ప్రకటించారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు జ్ఞానేశ్వరయ్య, కేఆర్ ఆంజనేయులు, తెడ్డు వెంకటేశ్వరరావు, సీహెచ్ఎల్వీ మారుతీరావు, సీఐటీయూ నాయకులు ఏవీ నాగేశ్వరరావు, కె.ఉమామాహేశ్వరరావు, డి.రమాదేవి, కె.ధనలక్ష్మి, ఏఐసీసీటీయూ నాయకులు ఎం.ఈశ్వరయ్య, పి.సత్తార్, ఆర్.కల్యాణ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనానికి తరలిరండి: రవీంద్రనాథ్

విశాలాంధ్ర-మార్కాపురం: విశాఖలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం స్థానిక పూల సుబ్బయ్య శాంతిభవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనానికి దేశంలోని 29 రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల గురించి సమగ్రంగా చర్చించి భవిష్యత్తులో ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకునేందుకు పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. కేంద్రంలోని మోదీ సర్కారు 42 కార్మిక చట్టాలకు తూట్లు పొడిచి... నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చిందన్నారు. అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసే అధికారం మోదీ సర్కారుకు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వ హయాంలో కోల్పోతున్న కార్మిక హక్కుల గురించి పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. విశాఖలో ఏఐటీయూసీ ఈ విలేకరుల సమావేశంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య, జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్కె కాశీం పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై అధికారులకు వినతి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గుంటూరులోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో కమిషనర్‌ని, రాష్ట్ర సచివాలయంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల, సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని కోరారు. 42 రోజుల సమ్మె సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. గ్రాట్యూటీ అమలు చేయాలని, చిన్న కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ వర్కర్లకు వర్తింపచేయాలని కోరారు. యాప్స్ అన్నింటినీ సవరించాలన్నారు. చనిపోయిన వారి మట్టిఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై కమిషనర్, ముఖ్య కార్యదర్శిల సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే రెండు సార్లు ఈ విషయాలన్నీ మాట్లాడామని చెప్పారు. ఏపీకి చెందిన కేంద్ర మంత్రులను కలిసి మాట్లాడవలసి ఉందన్నారు. వీలైనంత త్వరలో సమస్యలన్నీ పరిష్కారమయ్యే దిశలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రితో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అలాగే రేషన్ దుకాణాల సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. యాప్స్ సవరించే పని ప్రారంభించామని, వేతనాలు పెంపు విషయం సీఎంతో మాట్లాడుతామని అధికారులు తెలిపారు. త్వరలో సమీక్ష సమావేశం నిర్వహించాలని అసోసియేషన్ నాయకులు కోరారు. అందుకు కమీషనర్, ముఖ్యకార్యదర్శి అంగీకరించారు. అధికారులను కలిసిన వారిలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.ప్రేమ, ప్రధాన కార్యదర్శి జే.లలిత, సభ్యులు శారమ్మ, విజయ ఉన్నారు.

విశాఖ ఉక్కు... సెయిల్‌లో విలీనం

పోరాట కమిటీ డిమాండ్

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం (విశాఖ): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో నడపాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమగా ఉక్కును కొనసాగించాలని స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద గురువారం మహా ధర్నా నిర్వహించారు. అనంతరం కమిటీ నేతలు మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వల్లే స్టీల్ ప్లాంట్ నష్టాల్లో కూరుకుపోయిందని అన్నారు. కోకింగ్ కోల్, ఐరన్ ఓర్ లేక పోవడంతో ఉక్కు ఉత్పత్తికి తీవ్ర అంత రాయం ఏర్పడిందని అన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తేనే తప్ప మనుగడ లేదన్నారు. కేంద్రం విశాఖ ఉక్కును నూరు శాతం అమ్మాలని ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించక పోవడం వల్ల నానా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని చెప్పారు. తక్షణమే యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మిక నేతలు డి. ఆదినారాయణ, కె.ఎస్ఎన్.రావు, మసేన్ రావు, కె. రాజబాబు , జె.అయోధ్య రామ్, వై.టి. దాస్ , యూ .రామస్వామి, ఎన్.రామారావు, మంత్రి రాజ శేఖర్, నీరు కొండ రామ చంద్రరావు, కారు రమణ, పి.వి. రమణ మూర్తి, వరసాల శ్రీనివాస రావు, బొడ్డు పైడి రాజు, విల్లా రామ్మోహన్ కుమార్, డి.వి.ఆర్.రెడ్డి , డి. సురేష్ బాబు, కె.పరంధామయ్య , జె.రామ కృష్ణ, తాంద్ర కనక రాజు, యేళ్లేటి శ్రీనివాస్ , జి.ఆనంద్ , డి. దేముడు , ధాలి నాయుడు పాల్గొన్నారు. అచ్యుతాపురం సేజ్‌లోని ఎసెన్షియా కంపెనిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సంతాపాన్ని వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

మాంసపు ముద్దలకే శవపరీక్షలు

మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల రోదనలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఫార్మ కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటన 17 మంది కార్మికుల కుటుంబాల్లో విషాదం నింపింది. పనికి వెళ్లి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన కార్మికుల మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉండటం, మాంసపు ముద్దలకే శవపరీక్షలు నిర్వహిస్తుండటంతో మార్చరీల వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. చేతికి అందివచ్చిన బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల ఆవేదన వర్ణణాతీతంగా ఉంది. విజయనగరం జిల్లా గరివిడి మండలం అత్తమూరు గ్రామానికి చెందిన మహంతి నారాయణరావు (34), ట్రైనీ ఇంజనీర్ చల్లపల్లి హారిక (22), పార్వతీపురం ప్రాంతానికి చెందిన ఫిట్టర్ జువ్వాది పార్థసారథి (27), శ్రీకాకుళం జిల్లా పొందూరు ప్రాంతానికి చెందిన హంస ప్రశాంత్ (34) మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. కేజీహెచ్ మార్చురీకి 13 మృతదేహాలను తరలించగా అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. మిగతా మృతదేహాలను అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

కేజీహెచ్ వద్ద బాధితుల ఆందోళన-కార్మిక సంఘాల అండ

తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు ఆందోళనకు దిగాయి. కేజీహెచ్ మార్చురీ వద్ద బుధవారం రాత్రి నుంచి ఆందోళన జరుగుతోంది. గురువారం ఉదయం 6 గంటలకు కార్మిక సంఘాల నేతలు వచ్చి సంఘీభావం తెలిపారు. న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని బాధిత కుటుంబాలకు భరోసానిచ్చారు.

ఆశపు గంగరాజు ఆదర్శనీయుడు

12వ వర్ధంతి సభలో నెక్కంటి సుబ్బారావు

విశాలాంధ్ర-నర్సాపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసిన ఆశపు గంగరాజు ఆదర్శనీయుడని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు కొనియాడారు. ఆయన 12వ వర్ధంతి సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని మంగినవారి వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో గంగరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దారం కట్టిన అర్జీ అంటే అధికారులకు గుర్తుకొచ్చేది ఆశపు గంగరాజేనని, ఆయన ద్వారా ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం లభించేదని సుబ్బారావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని కే పెదపూడి గ్రామంలో జన్మించిన గంగరాజు... అభ్యుదయ యువజన సంఘం ఏర్పాటు చేసి ప్రజలలో సామాజిక చైతన్యానికి కృషి చేశారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి అనేక ఉద్యమాలలో పాల్గొన్నారని, పార్టీలో తనదైన ముద్ర వేశారని, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టి రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసి వర్ధంతి, జయంతి కార్యక్రమాలను మంగినవారి నగర్ ప్రజలు జరుపుకోవడాన్ని బట్టి ఆయనపై వారికున్న అభిమానాన్ని అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. విశాలాంధ్ర దినపత్రికకు విలేకరిగానూ గంగరాజు సేవలందించారని, రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ సంఘం అధ్వర్యంలో ఘన సత్కారం పొందారని తెలిపారు. పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ ఆయన సారథ్యంలోనే రూపుదిద్దుకుందన్నారు. ఉండిల్ పేరుతో పత్రికను నడిపారని, తన పత్రిక ద్వారా అధికారులకు ప్రజల సమస్యలను తెలియజేసేవారని సుబ్బారావు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయరావు, సత్తిబాబు, నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, నరసయ్య, తూతిక చంటి పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ వెబ్‌సైట్‌లో పది నమూనా ప్రశ్నాపత్రాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షల (మార్చి-2025) నమూనా ప్రశ్నా పత్రాలు పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తెచ్చింది. వాటిని అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించే పదో తరగతి పరీక్షలను సబ్జెక్టుల వారీగా నమూనా పేపర్లతో పాటు బ్లూ ప్రింట్, మార్కుల వెయిటేజీ అంశాలను విడుదల చేసింది. పరీక్షల్లో అడిగే ప్రశ్నల సరళి, వాటి కాఠిన్యత స్థాయి, మార్కుల భారత్వం, సమయం, సిలబస్ తదితరాలను అవగాహన చేసుకుని పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేందుకు విద్యార్థులకు ఇవి ఉపకరిస్తాయని వివరించింది. పదో తరగతి పరీక్షలకు సంబంధించి పది విభాగాల లాంగ్వేజీ పేపర్లతోపాటు మ్యాథ్స్, జనరల్ సైన్స్ పేపర్-1, పేపర్-2, సోషల్ స్టడీస్‌ను అందుబాటులో ఉంచింది. ఈ పేపర్ల ఆధారంగా ఏపీ విభాగాల నుంచి ప్రశ్నలు అధికంగా వస్తాయో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు స్పష్టత వచ్చేలా విద్యాశాఖ రూపొందించింది. ఎస్ఎస్‌సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించింది.

31న నూతన కౌలుచట్టంపై చర్చాగోష్ఠి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్డీయే కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన కౌలు చట్టంపై ఈనెల 31న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో చర్చాగోష్ఠి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య. పి.జమలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో గణనీయమైన సంఖ్యలో కౌలు రైతులున్నారని, అన్ని ప్రాంతాలు... పంటల్లో వీరే కీలకమైన పాత్రను పోషిస్తున్నారని తెలిపారు. కౌలురైతుల రక్షణ కోసం 1949లోనే 'ఆంధ్రప్రాంత కౌలుదార్ల రక్షణ చట్టం' పేరుతో ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొందించిందని గుర్తుచేశారు. అది సమగ్రంగా లేదు. కౌలుదార్లకు శాశ్వత సమగ్ర రక్షణ కల్పించలేదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ఏరియా) కౌలు చట్టం రూపొందించబడి, 1956 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చిందని, ఈ చట్టం సమగ్రంగా రూపొందించబడిన సక్రమంగా అమలుకు నోచుకోలేదన్నారు. ఇటీవల ఆధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో కౌలురైతుల సమస్యల పరిష్కారానికి ఒక సమగ్రమైన చట్టం అవసరమని స్పష్టం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లు భవిష్యత్తులో జరగకుండా కౌలురైతుల రక్షణ, సంక్షేమానికి తీసుకోవాల్సిన అంశాలపై ఈ చర్చాగోష్ఠి ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, రైతుసంఘాలు, కౌలురైతుల సంఘాలు, ప్రముఖులు తగిన సూచనలు, సలహాలిచ్చి సమగ్రమైన కౌలు రైతుల చట్టానికి దోహదపడాలని విజ్ఞప్తి చేశారు.

వికృత సంస్కృతిపై ఉక్కుపాదం

ప్రభుత్వానికి ముప్పాళ్ల విజ్ఞప్తి

విశాలాంధ్ర-వినుకొండ: యూట్యూబ్‌లలో, టీవీ సీరియల్స్‌లలో అశ్లీల జుగుప్సాకర చిత్రాలు కథనాలను నిషేధించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ విధమైన వికృత సంస్కృతిపై ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థ ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో భారీ పేలుడు సంభవించి 18 మంది కార్మికులు మృతి చెందడం విచారకరమని అన్నారు. వినుకొండలోని సీపీఐ కార్యాలయం శివయ్య భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఘటనకు యాజమాన్యమే కారణమని తేలితే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలు, మహిళా డాక్టర్లపై మానవ మృగాలుగా ప్రవర్తిస్తున్న వారిపై నిర్భయ చట్టం కఠినంగా అమలు చేయాలన్నారు. ఆ విధంగా చేయకపోవడం వల్ల మానవ మృగాలలో ఎటువంటి మార్పు రావడం లేదన్నారు. మహిళలపై గౌరవం పెరిగేలా విద్యాబోధన ఉండాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిందని, న్యాయవ్యవస్థను మరింత బలహీనపరిచిందని ముప్పాళ్ల విమర్శించారు. ఈ వ్యవస్థలను కొత్త ప్రభుత్వం దారిలో పెట్టాలని సూచించారు. జగన్ దుర్మార్గ పాలన ఫలితమే వైసీపీకి 11 సీట్లు రావడమన్నారు. ప్రజలను తక్కువ అంచనా వేయకూడదని ముప్పాళ్ల ఉద్ఘాటించారు. సీపీఐ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ ముందుకు సాగుతున్నదన్నారు. ప్రధాని మోదీ గొప్పగా ప్రచారం చేసుకున్నప్పటికీ ప్రజలు బీజేపీకి పరిమిత సీట్లు మాత్రమే కట్టబెట్టారని చెప్పారు. కమ్యూనిస్టుల మాటను కాంగ్రెస్ విని ఉంటే మోదీ ప్రభుత్వం వచ్చేది కాదన్నారు. వినుకొండ రాజకీయ చైతన్యం గల ప్రాంతమని, కమ్యూనిస్టు పార్టీ పటిష్టంగా ఉన్న కాలంలో మతసామరస్యం, లౌకికవాదంతో ప్రజలు అన్యోన్యంగా ఉండే వారన్నారు. నేడు మైనారిటీల హత్యలు, వివిధ వర్గాలపై దాడులు అధికమయ్యాయన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా సమస్యలపై ఈ నెల 19వ తేదీన జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టి కలెక్టరుకు వినతిపత్రం ఇస్తామన్నారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, సీనియర్ నాయకులు సంద్రపాటి సైదా, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, ఊట్ల రామారావు, ఎస్కె కిషోర్, ఆర్.వందనం పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు మోదుమూడి రామారావు ద్వారా రూ. 32 వేల సాయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకృతి ప్రకోపానికి గురైన కేరళలోని వయనాడ్ జిల్లాలో బాధితులకు తమ వంతు చేయూతగా సీపీఐ కృష్ణాజిల్లా నాయకులు మోదుమూడి రామారావు జిల్లా కేంద్రం మచిలీపట్నం భాస్కరపురంలో, మిత్రుల నుంచి రూ. 32,400 వసూలు చేసి సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి పంపారు. ఆ మొత్తాన్ని రాష్ట్ర పార్టీ ద్వారా వరద బాధితులకు చేర్చారు. విరాళాలు సేకరించి పంపిన మోదుమూడి రామారావును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అభినందించారు.

24 మంది మున్సిపల్ కమిషనర్‌ల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పెద్ద సంఖ్యలో మున్సిపల్ కమిషనర్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు 24 మంది ని బదిలీ చేస్తున్నట్లు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్ల బదిలీపై మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశాలు జారీ చేశారు. పలువురిని మాతృశాఖకు బదిలీ చేయగా, మరి కొంత మంది కమిషనర్లను మున్సిపల్ శాఖ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

మోదీ సర్కారుపై కాంగ్రెస్ పోరాటం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అదానీని రక్షించే దిశగా మోదీ ప్రయత్నిస్తున్నారని, ప్రజల ఆస్తులను కార్పొరేట్‌లకు దోచిపెడుతున్న మోదీ సర్కారుపై కాంగ్రెస్ పోరాడుతుందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. నాడు బ్రిటిష్ వారిపై నిస్వార్థంగా పోరాడి, స్వేచ్ఛయే లక్ష్యంగా అలుపెరగని సుదీర్ఘ సమరం చేసి, దేశానికి స్వాతంత్ర్యం కాంగ్రెస్ తీసుకొచ్చిందని ఆమె గురువారం ట్వీట్ ద్వారా గుర్తుచేశారు. కాంగ్రెస్ దేశం కోసం మరొక పోరాటం సాగిస్తుందన్నారు. సెబీ చీఫ్ మాధబి పూరీపై వచ్చిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపకుండా, అదానీ పెట్టుబడులకు సంబంధించి ఆమె పాత్ర గురించి దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతుంటే, వారిని రక్షించేందుకు కేంద్రం కుటిల ప్రయత్నం చేస్తోందన్నారు. మోదీ సర్కారు దివాళాకోరుతనాన్ని నిరసిస్తూ, ఇండియా కూటమి నేడు దేశవ్యాప్తంగా ఈడీ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తోందన్నారు. దేశంలోని 10కోట్ల మంది పెట్టుబడిదారుల ఆందోళనను ఏమాత్రం పట్టించుకోకుండా, నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్న బీజేపీ సర్కారును నిలదీస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి కార్పొరేట్ రక్కసి ధోరణిని ప్రజలపై రుద్దుతూ, ప్రభుత్వ సంస్థలను తన జేబుసంస్థలుగా మార్చిందని, కేవలం ప్రతిపక్షాలపై కక్షపూరిత దాడులకు మాత్రమే వాటిని వాడుకునే మోదీ నియంత పాలనను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.

పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

ఎమ్మెల్సీ బొత్స డిమాండ్-బాధితులకు పరామర్శ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అచ్యుతాపురం ఘటనలో చనిపోయిన కార్మిక కుటుంబాలకు పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. గతంలో ఎల్‌జీ పాలిమర్స్ ఘటన జరిగినప్పుడు అప్పటి వైసీపీ ప్రభుత్వం బాధ్యతగా స్పందించిందని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. బొత్స సత్యనారాయణ గురువారం కేజీహెచ్ వద్ద మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరిహారం చెక్కులు అందాకే మృతదేహాలను తరలించాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాధితులను పరామర్శించాల్సిన, ఓదార్చాల్సిన బాధ్యత ముఖ్యమంత్రికి లేదా అని బొత్స ప్రశ్నించారు. ఘటన జరిగిన 24గంటల తర్వాత కూడా అధికారులు ఎవరూ కనిపించడం లేదన్నారు. మళ్లీ ఇలాంటివి జరగకుండా పటిష్ట చర్యలను తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం బాధితులను కలుస్తారని బొత్స సత్యనారాయణ తెలిపారు.

యాజమాన్యంపై క్రిమినల్ కేసులు: ఐఎఫ్‌టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అచ్యుతాపురం (సెజ్) ఫార్మా పరిశ్రమలో 18 మంది కార్మికుల మరణానికి కారణమైన యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేసి క్రిమినల్ కేసులు పెట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వీ కృష్ణ, ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతులకు కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం సత్వరమే చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఫార్మా పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు చర్యలను తక్షణమే తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దర్యాప్తు కమిటీలు ఇచ్చే నివేదికలను కోల్డ్ స్టోరేజ్‌కి పరిమితం చేయకుండా అవి సూచించే చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ప్రమాదాలను నివారించే ఆస్కారం ఉండేదని నేతలు పేర్కొన్నారు.

సంపాదకీయం

కొరకరాని కొయ్య హేమంత్ సొరేన్

జార్ఖండ్ ఖనిజ వనరులకు ప్రసిద్ధి. ఇప్పుడు బీజేపీ ఆపరేషన్ లోటస్ వైఫల్యాలకు ప్రతీక. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ నాయకత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జె.ఎం.ఎం.)ను చీల్చి హేమంత్‌ను గద్దె దించడానికి బీజేపీ అగ్రనాయక ద్వయం నరేంద్ర మోదీ, అమిత్ షా చేయని ప్రయత్నం లేదు. కానీ ఇంతవరకు సఫలం కాకపోవడం జార్ఖండ్ రాజకీయాలలో హేమంత్ సొరేన్‌కు ఉన్న పట్టుకు నిదర్శనం. బీహార్ నుంచి విడిపోయి జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడానికి జె.ఎం.ఎం. సుదీర్ఘ పోరాటం చేసింది. ఒకప్పుడు జార్ఖండ్‌లో బీజేపీ ప్రభుత్వమే ఉండేది. హేమంత్ సొరేన్ అధికారంలోకి వచ్చిన తరవాత బీజేపీ నాయకత్వానికి నిద్రపట్టడం లేదు. ఎన్నికలలో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం సాధ్యం కానప్పుడు బీజేపీ ఇతర పార్టీలను చీల్చి అధికారం చేజిక్కించుకుంటుంది. గత పదేళ్ల కాలంలో కనీసం 12 రాష్ట్రాలలో బీజేపీ చేసిన పని ఇదే. రాజస్థాన్‌లో అశోక్ గెహ్లోత్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సచిన్ పైలెట్‌ను పావుగా వాడుకుని గెహ్లోత్‌ను గద్దె దించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పటికి అయిదు సార్లు హేమంత్ సొరేన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఇప్పుడు ఎన్నికలలో జె.ఎం.ఎం.ను ఓడించే ప్రయత్నం జరుగుతోంది. జె.ఎం.ఎం.ను మాత్రమే కాకుండా ఆ పార్టీకి ఓటు వేసే వారిలోనూ చీలికలు తీసుకొచ్చి లబ్ధి పొందాలని చూస్తోంది. జార్ఖండ్‌లో జె.ఎం.ఎం.-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఉంది. మొట్టమొదటిసారి 2021లో మహారాష్ట్రకు చెందిన ఒక బీజేపీ నాయకుడు కొంతమంది కాంగ్రెస్ శాసనసభ్యుల సహాయంతో సొరేన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కుట్ర చేశారు. ఒక హోటల్‌లో మంత్రాగం జరుగుతుండగా హేమంత్ ఆ కుట్రను భగ్నం చేశారు. అప్పుడు ఆ హోటల్ గదిలో 50 లక్షల రూపాయల నగదు బయట పడింది. హేమంత్ సొరేన్‌ను గత జనవరిలో అరెస్టు చేసినప్పుడు సొరేన్ శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటుచేసి చంపై సొరేన్‌ను ఆ స్థానంలో కూర్చోపెట్టి వెళ్లారు. హేమంత్ సొరేన్ ఎనిమిదిన్నర ఎకరాల భూమి ఆక్రమించారన్న ఆరోపణ సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. ఒక్క ఆధారం కూడా చూపించలేక పోవడంతో కేసు కొట్టేశారు. హేమంత్ సొరేన్ విడుదలయ్యారు. చంపై సొరేన్ చేత రాజీనామా చేయించి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. దీనితో ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ప్రయోజనాలను వదులుకోవడం ఇష్టంలేని చంపై సొరేన్‌పై తిరుగుబాటు బావుటా ఎగుర వేశారు. ఢిల్లీ కూడా వెళ్లి వచ్చారు. కానీ ఆయనను సమర్థించే ఎమ్మెల్యేలు ఎవరూ కనిపించకపోవడంతో ఢిల్లీ బీజేపీ పెద్దలు చంపై సొరేన్ ను కలుసుకోవడానికి కూడా నిరాకరించారు. అంతమాత్రం చేత బీజేపీ హేమంత్ సొరేన్ ను గద్దె దించే ప్రయత్నాలు వదిలి పెట్టిందని కాదు. చంపై సొరేన్ చేత కొత్త పార్టీ పెట్టించి జె.ఎం.ఎం. ఓట్లను చీల్చాలని అనుకుంటోంది. చంపై కొత్త పార్టీ పెట్టడానికి కావలసిన ఆర్థిక సహాయం చేయడానికి బీజేపీ సుముఖంగా ఉంది. 2021 జులై 24న హేమంత్‌ను పడదోసే మొదటి ప్రయత్నం జరిగింది. కాంగ్రెస్ సభ్యులకు డబ్బు ఎర వేసి ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్రను పసిగట్టిన హేమంత్ కేసు దాఖలు చేయించారు. అయితే తాము జార్ఖండ్ నుంచి మహారాష్ట్రకు కూరగాయలు తీసుకు వెళ్లడానికి ఈ డబ్బు తెచ్చామని బుకాయించారు. నిజానికి అది పచ్చి అబద్ధం. రెండోసారి 2022 జులై 30న అదే కుట్ర చేశారు. అప్పుడూ కాంగ్రెస్ శాసనసభా పక్షాన్ని చీల్చే ప్రయత్నం చేశారు. ఇందులో బెంగాల్, అసోం బీజేపీ నేతల పాత్ర కూడా ఉంది. అప్పుడూ బీజేపీకి మిగిలింది వైఫల్యమే. కాంగ్రెస్ శాసనసభ్యులు ఇర్ఫాన్ అన్సారీ, రాజేశ్ కశ్యప్, నవీన్ మిత్తల్‌ను సొరేన్ అరెస్టు చేయించగలిగారు. వారు నెల రోజుల పాటు జైలులో ఉండవలసి వచ్చింది. ఆ ముగ్గురినీ కాంగ్రెస్ తమ పార్టీ నుంచి బహిష్కరించింది. ఆ తరవాత మళ్లీ చేర్చుకోవడం రాజకీయ నైతిక పతనానికి నిదర్శనం. ఆ తరవాత హేమంత్ సొరేన్ భూమి ఆక్రమించారని ఆరోపించింది. ఈ విషయమై ఎన్నికల కమిషన్ దర్యాప్తునకు జార్ఖండ్ గవర్నర్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ హేమంత్ సొరేన్ శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని సిఫార్సు చేసింది. హేమంత్ సొరేన్ ఆ శాసనసభ్యులను అప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్‌కు తరలించగలిగారు. హేమంత్ సొరేన్ వెంటనే విశ్వాస ప్రకటనా తీర్మానం ప్రతిపాదించి నెగ్గ గలిగారు. అదే సమావేశంలో ఓ.బి.సి.ల రిజర్వేషన్లను 32 శాతానికి పెంచడానికి తీర్మానం కూడా ఆమోదింప చేసుకున్నారు. దీనితో హేమంత్ సొరేన్ ప్రజానుకూల నాయకుడు అన్న అభిప్రాయం బలపడింది. మళ్లీ 2024 జనవరి 31 న మరో కుట్ర జరిగింది. అప్పుడు బీజేపీ తన అమ్ముల పొదిలోంచి ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టొరేట్ ను బయటికితీసి హేమంత్ సొరేన్‌ను అరెస్టు చేయించింది. అరెస్టు చేయడానికి ముందే హేమంత్ జాగ్రత్తపడి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి చంపై సొరేన్‌ను ముఖ్యమంత్రి పదవిలో కూర్చో పెట్టారు. అదే సమయంలో తన సోదరుడు వసంత్ సొరేన్‌కు కూడా మంత్రి పదవి దక్కేట్టు చేశారు. ఈ లోగా లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఆదివాసులు అధికంగా ఉన్న నియోజకవర్గాలలో బీజేపీ ఘోర పరాజయం పాలైంది. అప్పుడు గానీ హేమంత్ సొరేన్ జోలికి వెళ్తే జార్ఖండ్ ఆదివాసులు సహించబోరన్న విషయం బీజేపీ తలకెక్కలేదు.

తరవాత తాత్కాలిక ప్రాతిపదికపై ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంపై సొరేన్ రాజీనామా చేయక తప్పలేదు. కానీ ఆయనకు ముఖ్యమంత్రి పదవి మీద ఆశ పెరిగింది. బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీని నిలబెట్టుకోలేక పోయింది. ముఖ్యమంత్రి పదవిమీద ఆశతో చంపై బీజేపీలో చేరాలనుకున్నారు. చంపై సొరేన్‌ను బీజేపీలో చేర్చుకోకపోవడానికి ఆయన వెంట శాసన సభ్యులెవరూ లేకపోవడం ఒక్కటే కారణంకాదు. అంతకు ముందే బీజేపీలో ఉన్న నాయకులు ఆయనను చేర్చుకోవడానికి చాలా విముఖంగా ఉన్నారు. వారు తిరుగుబాటుచేస్తే కొరవితో తలగోక్కున్నట్టేనని బీజేపీకి అర్థం అయింది. అందుకే తమను నమ్ముకుని హేమంత్ మీద తిరుగుబాటు చేసిన చంపై సొరేన్ కోసం బీజేపీ ఒక పథకం సిద్ధం చేసింది. అదే ఆయన చేత కొత్త పార్టీ పెట్టించడం. కొత్త పార్టీ ఏర్పాటుకు ఖర్చయ్యే డబ్బంతా ఇవ్వడానికి బీజేపీ సిద్ధపడిందంటున్నారు. చంపై చేయాల్సిందల్లా ఆదివాసుల ఓట్లకు గండి కొట్టడం. ఆదివాసుల ఓట్లలో చంపై సొరేన్ 25 శాతం ఓట్లు సంపాదించగలిగినా బీజేపీకి అధికారం దక్కే అవకాశం ఉంటుంది. హేమంత్ సొరేన్ పరిస్థితి అప్పుడు ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నట్టుగా తయారవుతుంది. ఒక వేపున చంపై సొరేన్‌ను ఎదుర్కోవాలి. మరో వేపు బీజేపీ కుట్రలను భగ్నం చేయగలగాలి. ఇది సునాయాసమైన వ్యవహారమైతే కాదు. చివరకు చంపై సొరేన్ బీజేపీ సేవలో తరించిపోయిన అసదుద్దీన్ ఒవైసీ, మాయావతి, ప్రకాశ్ అంబేడ్కర్, చౌతాలా స్థాయిలోనైనా మిగులుతారా లేదా అన్నది అనుమానమే. సాధారణంగా బీజేపీ ఎక్కడైనా ఆపరేషన్ లోటస్ ప్రారంభిస్తే చిటికెలో పని పూర్తిచేస్తుంది. కానీ హేమంత్ సొరేన్ కొరకరాని కొయ్యలా తయారయ్యారు.

సంపద సృష్టికి మహదవకాశం



డాక్టర్ కొల్లా రాజమోహన్

ఆంధ్రప్రదేశ్‌లో ఇనుప ఖనిజం, బొగ్గు, సున్నపురాయి, సిలికా, బాక్సైట్, గ్రానైట్, వజ్రాలు, బంగారం, వెండి, మాంగనీస్, రాగి, అల్యూ మినియం, యురేనియం, థోరియం లాంటివేకాకుండా భూమిలో లభించే శిలాజ ఇంధనాలు అంటే చమురు, సహజవాయువులను మైనింగ్ ద్వారా వెలికి తీస్తున్నారు. ఇంతకాలం వీటిపై పన్ను వేసే అధికారం, హక్కులు కేంద్ర ప్రభుత్వానికే ఉన్నాయి. వీటిపై హక్కులు తమకే ఉండాలని చాలా సంవత్సరాలుగా ఆయా రాష్ట్రాలు న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. చిట్టచివరికి ఆ పోరాటం ఫలించి సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు నిచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిదిమంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గనులు, ఖనిజాలపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని, కేంద్రానికి ఆ హక్కు లేదని జులై 25న 8-1 మెజార్టీతో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు రాష్ట్రాల అధికారాన్ని, ఫెడరలిజం స్ఫూర్తిని నిలబెట్టేదిగా ఉన్నది. ఖనిజాలు, నిక్షేపాలుగల భూమిపై రాయల్టీ విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని 1989లో కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కొన్ని రాష్ట్రాలు సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లాయి. తాజాగా ఈ ఏడాది జులై 25న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో 1999 నుంచి ఉన్న సివిల్ అప్పీల్స్ 4056-4064 నుంచి ఇప్పటివరకు వున్న అతి పురాతనమైన కేసులన్నీ పరిష్కారమయ్యాయి. ఈ కేసు విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ రిషికేశ్ రాయ్, జస్టిస్ అభయ్. ఎస్ ఓకా, జస్టిస్ జేబీ పార్దివాల, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్, జస్టిస్ సతీష్ చంద్రశర్మ, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాషిహ్ , జస్టిస్ బీ.వీ. నాగరత్న ఉన్నారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భూమి నుంచి వెలికితీసే సహజ వనరులపై పన్నులను రాష్ట్రాలు వసూలు చేసుకునే మార్గానికి తెరతీసింది. ఈ తీర్పు ఫలితంగా అప్పులలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సంపద్వంతమైన రాష్ట్రంగా అభివృద్ధి పరచవచ్చు. భూమి నుంచి మైనింగ్ ద్వారా వెలికితీసిన ఖనిజాలపై పన్ను విధింపునకు సుప్రీంకోర్టు తీర్పు ఒక మహదవకాశాన్ని కల్పించింది. ఈ తీర్పుతో సహజ వనరులు దండిగా ఉన్న ఒడిశా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గడ్ లాంటి రాష్ట్రాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. మన దేశంలో ఖనిజాలు, సహజవాయువు, పెట్రోలియం ఉత్పత్తులు, నిక్షేపాలుగల రాష్ట్రాలు తక్కువ ఆదాయంతో వెనుకబడిన రాష్ట్రాలుగా ఉంటూ, పర్యావరణ దుష్ట ప్రభావాలన్నిటినీ అనుభవిస్తూ పేదరికంలో వున్నాయి.కేంద్రం - రాష్ట్రాల మధ్య అధికార పంపిణీలో ఖనిజ వనరులపై పెత్తనం ఎవరిది? పన్నులు విధించే అధికారం ఎవరిది అని సుప్రీంకోర్టు సుదీర్ఘ విచారణ జరిపింది. విచారణ క్రమంలోనే, పార్లమెంటు చేయగలిగేది ఆంక్షలు విధించడమే కానీ పన్ను విధించే అధికారం ఉండదన్నారు.

ఖనిజ హక్కులపై పన్ను విధించే అధికారం ఎవరిది?

ఇండియా సిమెంట్స్ ఎం తమిళనాడు(1990) , కేశోరామ్ సిమెంట్స్ ఎం పశ్చిమ బెంగాల్ (2004), మధ్య నడిచిన కేసులలో పరస్పర విరుద్ధమైన తీర్పులు వచ్చాయి. రాయల్టీ పన్ను ఔనా కాదా? రాష్ట్రాలకు పన్ను విధించే అధికారం వుందా లేదా? ఖనిజాలు, ఖనిజ హక్కులపై పన్ను విధించే అధికారం ఎవరిది? రాష్ట్ర ప్రభుత్వానిదా లేక కేంద్ర ప్రభుత్వానిదా? అనే విషయంపై కొన్ని దశాబ్దాల నుంచి వాదోపవాదాలు నడుస్తున్నాయి. వందల కేసులు ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. **కోర్టుల్లో నడిచిన ముఖ్యమైన కేసులు-**

1)రాజ్యాంగంలోని 246 ఆర్టికల్ ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించి 1957లో మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్(ఎమ్ఎమ్‌డిఆర్) చట్టాన్ని పార్లమెంటు తెచ్చింది. ఆ చట్టం కింద సెక్షన్ 9 ద్వారా ఖనిజాలను తీస్తున్నవారు రాయల్టీని యూనియన్ ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. ఈ చట్టంపై కొన్ని వందల కేసులు నడిచాయి.

2) తమిళనాడు ప్రభుత్వం లైమ్‌స్టోన్ ఖనిజాన్ని వెలికితీస్తున్న ఇండియా సిమెంట్స్‌పై 7వ షెడ్యూల్‌లోని రాష్ట్ర జాబితాలోని 49, 50 ఎంట్రీల ప్రకారం భూమి పన్ను విధించింది. ఇండియా సిమెంట్స్ ఎం తమిళనాడు కేసులో 7 గురు సభ్యులున్న సుప్రీంకోర్టు బెంచ్, మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ చట్టం ప్రకారం, రాయల్టీపై సెస్, పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికిలేదన్నారు. రాయల్టీ అంటే పన్ను అన్నారు.

3) కేశోరామ్ ఇండస్ట్రీస్ ఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మధ్య నడిచిన కేసులో, రాజ్యాంగ బెంచ్ తద్విరుద్ధమైన తీర్పు ఇచ్చింది. పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. రాయల్టీ అంటేపన్ను కాదన్నారు. అంతకుముందు ఇండియా సిమెంట్స్ ఎం తమిళనాడు కేసులో ఇచ్చిన తీర్పు నిర్ణయం అనుకోకుండా తప్పిదం నుండి ఉద్భవించిందన్నారు. రాయల్టీ పన్ను కాదన్నారు. కోర్టు విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్, అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణిగారిని ఉద్దేశించి ఒక ముఖ్యమైన వ్యాఖ్యానం చేశారు. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లోని రాష్ట్ర జాబితా 2లోని 50వ ఎంట్రీ ప్రకారం, "పన్ను విధించే అధికారం పార్లమెంటుకు ఇవ్వరాదని, అది రాష్ట్రాలకు మాత్రమే ఇవ్వాలని తెలిపింది. కానీ, ఖనిజాభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా , మీరు ఈ పద్ధతిలో పన్ను విధించకూడదని పార్లమెంటు చెప్పవచ్చు లేదా ఉదాహరణకు, పన్ను 20శాతానికి మించకూడదనవచ్చు. ఎందుకంటే నిర్దిష్టమార్గంలో పన్ను విధిస్తే, అది ఖనిజ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంద నవచ్చు" అన్నారు. పన్ను విధించే శాసనాధికారం రాష్ట్రాలకే వున్నది!

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 8-1 మెజార్టీతో ఇచ్చిన తీర్పులో ముఖ్యమైన అంశాలు

ఎ). ఖనిజ హక్కులపైపన్ను విధించే శాసనాధికారం రాష్ట్ర శాసనసభలకు ఉంటుంది. యూనియన్ జాబితాలోని ఎంట్రీ 54 కింద ఖనిజ హక్కులపై పన్ను విధించే శాసనపరమైన సామర్థ్యం పార్లమెంటుకు లేదు, ఇది జనరల్ ఎంట్రీ. మినరల్ హక్కులపై పన్ను విధించే అధికారం రాష్ట్ర జాబితాలోని ఎంట్రీ 50లో పేర్కొన్నందున, ఆ విషయానికి సంబంధించి పార్లమెంటు తన విశేష అధికారాలను ఉపయోగించలేదు.

బి). గనులు, క్వారీలతో కూడిన భూములపై పన్ను విధించేందుకు రాష్ట్ర జాబితాలోని ఎంట్రీ49తో పాటు ఆర్టికల్ 246 ప్రకారం రాష్ట్ర శాసనసభలు శాసన సామర్థ్యాలను కలిగిఉంటాయి. లిస్ట్‌లోని ఎంట్రీ50కి సంబంధించి ఖనిజాభివృద్ధికి సంబంధించిన చట్టంలో పార్లమెంటు విధించిన "పరిమితులు" లిస్ట్‌లోని ఎంట్రీ49పై పనిచేయవు, ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం ఆ ప్రభావానికి ఎటువంటి నిర్దిష్ట నిబంధన లేదు.

వసూలు చేసిన సొమ్ము తిరిగి ఇవ్వండి!

సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు తర్వాత కొన్ని రాష్ట్రాలు గనులు, ఖనిజాలపై 1989 నుంచి విధించిన రాయల్టీ సొమ్మును వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌ను కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టులో బుధవారం వ్యతిరేకించింది. ఒక్క ప్రభుత్వరంగ కంపెనీలే 70 వేల కోట్లను తిరిగిచెల్లించాల్సి వస్తుందని, దానివల్ల వాటి ఖజానా ఖాళీఅయి పౌరులనుంచి ఆ సొమ్మును అధిక ధరల రూపంలో వసూలు చేసుకోవాల్సి వస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో తన వాదనలు వినిపించారు. కేంద్రప్రభుత్వ వాదనలను తిరస్కరించి 2005 ఏప్రిల్ ఒకటి నుంచి కేంద్రం, గనుల కంపెనీలు వసూలుచేసిన రాయల్టీని తిరిగి రాష్ట్రాలకు ఇవ్వాలని కూడా సుప్రీంకోర్టు ఆగస్టు 14వ తేదీన స్పష్టం చేసింది. రాయల్టీ బకాయిలు రెండు లక్షల కోట్ల రూపాయలకు మించి ఉండొచ్చని అంచనా. వచ్చే 12 ఏళ్లలో దశలవారీగా కేంద్రం, గనుల కంపెనీలు రాష్ట్రాలకు బకాయిలు చెల్లించవచ్చని ధర్మాసనం పేర్కొంది. బకాయిలు చెల్లింపుపై ఎటువంటి అపరాధ రుసుమును విధించరాదని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు అమలులోకివస్తే, ఆర్థిక వనరులు లేక, అప్పులు దొరకక, పన్నులు వేయలేక దిక్కుతోచనిస్థితి ఉన్నటువంటి రాష్ట్రాలకు కొంత ఉపశమనం కలుగుతుంది. కార్పొరేటు కంపెనీల దోపిడీని నియంత్రించి గుంటూరు ఛానల్ లాంటి సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేసి ప్రజలకు సాగునీరు తాగునీరు ఇవ్వవచ్చు. అయితే కోర్టువిచారణలో పెట్రోల్, గ్యాస్ గురించి ప్రస్తావించలేదు. 438 మంది పిటిషన్ దారులు గాని, ప్రభుత్వం గానీ పెట్రోలియం ప్రొడక్ట్స్ గురించి అడగనందున సుప్రీంకోర్టు విచారణలో లేవని కోర్టు తెలియజేసింది. ఇనుప ఖనిజం, బొగ్గు, మైకా,బాక్సైట్, గ్రానైట్, వజ్రాలు, బంగారం, వెండి, మాంగనీస్, బాక్సైట్, యురేనియం, థోరియం లాంటివేకాకుండా భూమిలో లభించే శిలాజ ఇంధనాలు అంటే చమురు, సహజవాయువులను అన్ని దేశాలలో ఖనిజ సంపదగా పరిగణిస్తారు. ఖనిజ సంపదను ఆర్గానిక్, ఇనార్గానిక్ గా విభజించారు. ఆయిల్ ఫీల్డ్స్, మినరల్ ఆయిల్ రిసోర్సెస్, పెట్రోల్, గ్యాస్‌లను ఆర్గానిక్ సంపదగా పేర్కొన్నారు.

పెట్రోలియం ఉత్పత్తులు, గనులు లాంటి నిక్షేపాలు గల రాష్ట్రాలు ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలుగా తక్కువ ఆదాయంతో ఉన్నాయి. సహజ వనరులు బాగా ఎక్కు వగా ఉన్న రాష్ట్రాలు చాలా పేద రాష్ట్రాలుగా ఉన్నాయి. ఆయిల్, గ్యా స్ నిక్షేపాలు అపారంగా ఉన్న రష్యా,అమెరికా,ఇరాన్,సౌదీదేశాలు సంపద్వంతంగావున్నాయి. మనకు గ్యాస్, ఆయిల్ దండిగావున్నా మన రాష్ట్ర సంపద పెరగలేదు. అంబానీల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుంది. రాష్ట్రంలో లభించే ఖనిజ సంపదలన్నిటిపైనా ఆశ్రిత పెట్టుబడిదారీవర్గమైన అంబానీ లాంటివారి ఆధిపత్యం కొనసాగుతున్నది.

ఒకవైపు బంగారపు సింహాసనాలు మరోవైపు రైతుల ఆత్మహత్యలు!

ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా స్థానికంగా లభ్యమయ్యే సహజ వనరులను ఉపయోగించుకునే హక్కు, అమ్ముకునే హక్కు, పన్ను విధించేహక్కు, ఆ ప్రాంత ప్రభుత్వానికి ఉండటం సహజం. ఈ సహజ న్యాయసూత్రాన్ని జులై 25 సుప్రీంకోర్టు తీర్పు బలపరిచింది. సహజ వనరులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి ఉత్పత్తిలో 50శాతం కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ కూడా చెప్పింది. కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల వాదనలను పెడచెవిన పెట్టింది. 50శాతం వాటా ఇవ్వలేదు. పన్ను విధించే హక్కు లేదన్నారు. కష్టాలు మనకి, సంపద కార్పొ రేట్ కంపెనీలకు వెళుతుంది. భూమిలోపల కొన్ని లక్షల సంవత్సరాల పరిణామాల ఫలితంగా ఖనిజాలు, సహజవాయువు, చమురు ఏర్పడుతుంది. అటువంటి విలువైన ఖనిజ సంపదను కొద్దిమంది ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గానికి కట్టపెడుతున్నారు. ఖనిజాలు భూమి నుండి వెలికితీసిన ఫలితంగా భూమిలో, పర్యావరణంలో ఎన్నోమార్పులు సంభవిస్తున్నాయి. భూగర్భ జలాలు, చెరువులు, బావులు, గాలి కలుషితమై కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, కేన్సర్‌బారిన పడుతున్నారు. అపారమైన సహజ సంపదను బడాకార్పోరేట్ కంపెనీలకు అప్పచెప్పి ఆదివాసీలను గాలికి వదిలేశారు. సహజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలకు కనీస జీవన సౌకర్యా లను కలగచేయటంలో విఫలం చెందారు. కేజీ బేసిన్‌లో లభ్యమయ్యే గ్యాస్, ఆయిల్‌తో సహా, పన్ను విధించే రాజ్యాంగ హక్కు మనకున్నదని చెప్పాలి. అందుకు జులై 25 సుప్రీంకోర్టు తీర్పును ఉదహరించాలి. సుప్రీంకోర్టు తీర్పులో ఇతర ఖనిజాలతోపాటు గ్యాస్, చమురును చేర్చాలని సుప్రీంకోర్టులో న్యాయపరమైన పోరాటం చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రాలలో లభించే ఖనిజ వనరులపై రాష్ట్ర ప్రభుత్వం పన్ను విధించాలి. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్టీలకు అతీతంగా అన్ని వామపక్ష విప్లవ పార్టీలు, వివిధ రంగాల ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు, ప్రజాస్వా మ్యవాదులు సమైక్యంగా ముందుకు కదలాల్సిన తరుణం ఆసన్నమయింది. ప్రజలకు దక్కాల్సిన సహజ వనరులపైహక్కు లపై ఆధిపత్యం చలాయిస్తున్న అదానీలాంటి ఆశ్రిత పెట్టుబడిదారీవర్గంపై ప్రజాఉద్యమాన్ని నిర్మించడానికి ముందుకు సాగుదాం! రాష్ట్రాలలో లభించే ఖనిజసంపదపై రాష్ట్ర ప్రభుత్వాలకు పన్ను విధించే హక్కు ను గుర్తించిన చారిత్రాత్మక సుప్రీంకోర్టు తీర్పు వెలుగులో సమైక్య ఉద్యమాన్ని నిర్మించాలి!

కన్వీనర్, కేజి బేసిన్ గ్యాస్ అండ్ ఆయిల్ సాధన సమితి
సెల్: 9000657799

అక్షరాన్ని చంపలేం

అక్షరం ఆయుధంకన్నా గొప్పది. అందరూ ఈ విషయం తెలుసుకోవాలి. ముఖ్యంగా రాజకీయ నాయకులు, అవినీతిపరులు కళ్లు తెరవాలి. అబ్బో ఏంటి బావ ఈ రోజు పెద్దవాళ్లపై పడ్డావు జాగ్రత్త. ఎందుకు జాగ్రత్త నేను ఈ రోజు చనిపోతున్నా మరల 2047లో పుడతా ఆనాడు వికసించిన భారత్‌లో, వికసించిన మనుషులతో హాయిగా బతకవచ్చు. అదేం అవసరం లేదు. నువు వచ్చేటప్పుడు అక్షరం చాలా గొప్పది అంటున్నావు కదా. అది కోట్ల మందిని చైతన్య పరుస్తుంది. ప్రభుత్వాలను పడగొట్ట కలదు. కొత్త ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలదు. అందుకే రాజకీయాలు పత్రికలకు విలువిచ్చేది. ఒక దుర్మార్గుడిని కొట్టవచ్చు, తిట్టవచ్చు, చంపవచ్చు, చివరకు ఉరితీయవచ్చుగాని అక్షరాన్ని ఉరితీయ గల్గినవాడు ఇంత వరకు పుట్టలేదు. రవికాంచని చోట కవిగాంచగలడంటారు. ఆ కవి మస్తిష్కం నుంచి వచ్చే అక్షర సుడిగాలిలో నియంతలు సైతం కొట్టుకుపోక తప్పదు. గతంలో రాజులను దించి ప్రజలకు పట్టం కట్టింది ఆ తరువాత ఆంగ్లేయులను తరిమికొట్టింది, ప్రజల కడగండ్లు చూచిన రచయిత పెన్ను క్యాప్ తీయకమానడు. అక్షరానికి మనసుకు బావుండదు. మనసు స్పందించి కలం పడితే స్వార్థపరుల పునాదులు కదలక మానవు. నిజమేనయ్యా కాని ఇప్పుడలాకాక అక్షరాన్ని అమ్మేస్తున్నారుగా. రచయిత పాళీలు వంకరపోతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్నవారిని గద్దె దించి తామెక్కడమే రాజకీయంగా నడుస్తోంది. కొందరు వారి వెంటపడి వారి అనుచరులుగా మారి తలకాయలు తాకట్టు పెడుతున్నారు. ప్రలోభాలకు లొంగి వివేచన మరచిపోతున్నారు. అటువంటి వారిని చైతన్యపరచవలసిన రచయిత అక్షరాన్ని అమ్ముకుంటున్నాడు. సమాజానికి మార్గదర్శి కావలసిన రచయిత అమ్ముడుపోయి వ్యవస్థను తిరోగమనంలోకి నెట్టడం చాలా బాధాకరం. సమాజంలో మనిషి బతకాలంటే మనిషికి ప్రాథమికంగా స్వేచ్ఛ అవసరం. భావ స్వాతంత్ర్యం అవసరం. అవి లేనప్పుడు మనిషి బతుకు బానిస బతుకవుతుంది. ప్రశ్న వేయనిదే నిజం తెలియదు. ప్రగతి ఉండదు. ప్రశ్నించడం, ఆలోచించడం చేయనప్పుడు జంతువువలే అనుసరించడం అలవాటై జంతువువలే బతకడం శోచనీయం.

ప్రస్తుత రాజకీయాలు ప్రభుత్వాలను మార్చడమే ధ్యేయంగా సాగుతున్నాయి. మారవలసింది ప్రభుత్వాలు కాదు వ్యవస్థ. సమాజంలో వ్యవస్థ ఒక భాగం మాత్రమే రాజకీయాలు ప్రజలు పాలించడానికి ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వాలను గాడి తప్పినప్పుడు రీకాల్ హక్కు ద్వారా దించే హక్కు ప్రజలకు అవసరం. అంతేగాని అయిదేళ్లు ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని భరించనవసరంలేదు. మనిషి ముందుగా మూఢనమ్మకాల నుంచి బయటపడాలి. ప్రతి మనిషి స్వతంత్రంగా ఆలోచించాలి. ఒక నాయకుడో, ఒక వేదాంతో, మతప్రవక్తో చెప్పిదే వేదంగా భావించనవసరంలేదు. అలా వాళ్లు చెప్పిందే ఆచరిస్తే అది మూఢభక్తి అనిపిస్తుంది. మనిషి మానవత్వం కోల్పోయి అమానవీయునిగా మారరాదు.

అయిదేళ్ల పదవికి మురిసిపోయి మనసుకు ముసుగేసి ప్రజావ్యతిరేకపాలనచేస్తూ మనిషిని మతం మత్తులో ముంచితే రచయిత పెన్ను క్యాప్ తీయక మానడు. అరచేయి అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేని విధంగా అక్షరపొదిలో నుంచి వచ్చే అక్షర ఆయుధాన్ని ఆపలేరు. నిజమే బావ మనిషిని మతానికి బానిసగ మారుస్తున్న వ్యవస్థపై పోరాటానికి రచయితలు అక్షరాన్ని ఆయుధంగా ఉపయోగించవలసిన అవసరం ఏర్పడింది. వివిధ పార్టీల నాయకుల ప్రసంగాలకు, బూతులకు, వార్తాపత్రికలు వేదిక కారాదు. పత్రికలు, ఛానళ్లు వ్యవస్థ మార్పు కొరకు కృషిచేయాలి. వ్యవస్థ పునాదులు కదపకుండా మనిషి మారడు. మనిషి చైతన్యంతో స్వతంత్రంగా ఆలోచించాలి. ఈ దశలో సామాజిక కార్యకర్తలను, రచయితలను మతం బలి తీసుకుంటున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. స్వతంత్రంగా ఆలోచించిననాడు, ధనానికి ఇతర ప్రలోభాలకు లొంగనినాడు రాజకీయ నాయకుల ఆటకు ముగింపు పలకకలదు. పార్టీ మార్పునకు కాకుండా వ్యవస్థల మార్పు కోసం రచయితలు కృషి చేయాలి. ఒకప్పుడు రాజకీయ నాయకులు తప్పుచేస్తే మరునాడే కవులు, రచయితలు స్పందించేవారు.

ప్రస్తుతం ఆ చైతన్యం కొరవడింది. నాటి పత్రికల స్ఫూర్తిని నేటి వార్తాపత్రికలు కొనసాగించ వలసిన అవసరం ఉంది. అప్పుడే రాజకీయ నాయకులలో మార్పునకు అవకాశం ఉంటుంది. అప్పుడు నాయకులు తప్పుచేయడానికి వెనకడుగువేస్తారు. అసలు భారత, రామాయణాలవల్ల ఒకప్పుడు మనిషి మారేడేమోగాని ప్రస్తుతం అవి వల్లెవేయవలసిన అవసరంలేదు. ఇప్పుడు కూడా అనైతిక ధర్మాన్ని, మనుసంస్కృతిని యువత మెదళ్లలో నాటడం ఘోరమైన తప్పిదం కాగలదు. కులమతాల చట్రంలో ఇరుక్కుని భావదాస్యం చేస్తున్న నేటి సమాజాన్ని చైతన్యపరిచే బాధ్యత అక్షర సృష్టికర్తలు తీసుకోవాలి. అక్షరానికి మరణంలేదు. అక్షరాన్ని చంపగలవాడు లేదని గ్రహించాలి.

సెల్ : 9885569394

గతమెంతో ఘన చరిత్ర

కోల్‌కత ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజి ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారంచేసి హత్య చేసిన దుర్ఘటన దేశమంతటా డాక్టర్ల నిరసనకు దారితీసింది. ఇప్పుడు ఈ ఆసుపత్రి పేరు అందరికీ తెలుసు. అయితే ఆ ఆసుపత్రి చరిత్ర తెలిసిన వారు తక్కువమందే. ఈ ఆసుపత్రి నిర్మాణానికి డాక్టర్ రాధా గోవింద్ కర్(ఆర్‌జీ కర్) తన యావదాస్తిని వెచ్చించారు. అప్పటికీ నిధులు సరిపోకపోతే యాచన ద్వారా డబ్బు సేకరించి ఈ ఆసుపత్రి నిర్మించారు. బెంగాల్ ప్రజలకు ఎన్నో సేవలు అందించిన ఈ ఆసుపత్రి నేడు శవాలు అమ్ముకునే వారి పరం కావడం అత్యంత విచారకరం.

1899 మార్చిలో ప్లేగు వ్యాధి కోల్‌కతాను వణికించింది. ఈ మహమ్మారికి ఆనాడు వేలాదిమంది బలయ్యారని చరిత్ర చెబుతోంది. ప్లేగు అంటేనే భయంకరమైన వ్యాధి. అలాంటి వ్యాధికి చికిత్స చేసేందుకు ఐర్లాండ్ మహిళ సిస్టర్ నివేదిత, డాక్టర్ గోవింద్‌కర్‌లు ఎనలేని సేవలు అందించారు. సిస్టర్ నివేదిత ఇరుకైన వీధులు, సందులు తిరిగి ప్లేగు వ్యాధికి వెనుకాడక రోగులకు అపారమైన సేవలందించారు. డాక్టర్ రాధా గోవింద్ కర్(ఆర్‌జీ కర్) ఆనాడు జిల్లా ఆరోగ్య అధికారిగా ఉన్నారు. ప్రభుత్వ అధికారస్థాయి ఉన్న గోవింద్‌కర్ గ్రామ గ్రామం తిరిగి వైద్య చికిత్స చేశారు. ఆయన కలకత్తా మారుమూల ప్రాంతాల్లోనూ రోగులకు సేవలందించడం కాక, మందులు కొనుగోలు చేయలేని వారికి డబ్బు కూడా అందించారు. ఆయన డాక్టరు విదేశాల నుంచి డిగ్రీ పొందారు. అయినప్పటికీ, స్వచ్ఛందంగా గ్రామాలకు వెళ్లి పరిశుభ్రంగాలేని వీధులన్నింటినీ బాగుచేయించేందుకు, వైద్యసేవలు అందించేందుకు తన జీవితాన్నే అంకితం చేశారు. సౌఖ్యమైన జీవితాన్ని అనుభవించే అవకాశం ఉన్నా ఉచిత వైద్యసేవలు అందించారు. ఆయన పేరుతోనే ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీని, ఆసుపత్రిని ఏర్పాటుచేశారు. కోల్‌కతాలో నాణ్యమైన ప్రభుత్వ ఆసుపత్రులలో ఇదొకటి. రోగులకు గొప్ప సేవలందించిన ఆర్‌జీ కర్ పేరును బెంగాల్‌లో గుర్తుంచుకోకపోవడం సిగ్గుపడవలసిన అంశం. ఈ తరానికి ఆసుపత్రి చరిత్ర గురించి అసలు తెలియదు. బ్రిటీష్ ఇండియాలో ఆర్‌జీ కర్ మెడిసిన్‌లో ఘనుడుగా తెలుసు.

బెంగాల్ ప్రజలకు తన జీవితమంతా వైద్యసేవలందించారు. రాధా గోవింద్ కర్ 1852 ఆగస్టు 23వ తేదీన హౌరా జిల్లాలో జన్మించారు. ఆయన తండ్రి దుర్గాదాస్ కర్. దాస్‌కర్ ఢాకాలో మిడ్‌ఫోర్టు ఆసుపత్రిని నెలకొల్పారు. రాధా గోవింద్‌కర్ అత్యంత మేధావి అయిన విద్యార్థి. మెడిసిన్ చదివేందుకు 1880లో కోల్‌కతా మెడికల్ కాలేజీలో చేరారు. ఆయనకు కళలంటే కూడా చాలా మక్కువ. 1883లో ఆయన స్కాట్లాండ్ వెళ్లి ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీలో చేరి 1887లో ఎమ్ఆర్‌సీపీలో గ్రాడ్యుయేషన్ పొందారు. ఆయన స్నేహితులు, ప్రొఫెసర్లు ఇంగ్లాండ్‌లో వైద్యవృత్తిని చేపట్టాలని సూచించారు. అయితే ఆయన తిరిగి తను జన్మించిన బెంగాల్‌కు చేరుకున్నారు. ఆయన మెడిసిన్‌పై బెంగాలీలో పుస్తకాలు రచించారు. ఆ కాలంలో మెడిసిన్‌పైన పుస్తకాలు లేవు. ఆయన రచించిన ప్రథమ గ్రంథం 'విషగ్‌బంధు' ఈ పుస్తకాన్ని 1871లో ప్రచురించారు. ఇంకా ఆయన 'శాంక్‌షిప్ట్ షరీర్ తత్వ', 'రోగి పరిచర్య', 'విషక్ సుహృద్', 'ప్లేగు', 'స్త్రీరోగార్ చిత్రావళి' తదితర అనేక గ్రంథాలను రచించారు. రోగుల సమస్యలను పరిష్కరించడానికి కేవలం పుస్తకాలను రచిస్తే సరిపోదని ఆయన గుర్తించారు. ఆసుపత్రిని స్థాపించాలని నిర్ణయించారు. అయితే ఆయన వద్ద డబ్బులేదు. అప్పుడు తన వద్ద ఉన్న వస్తువులను విక్రయించడమే గాక కోల్‌కతాలోని సంపన్నుల యాచించి డబ్బు సేకరించారు. వివాహాలు, ఉత్సవాలు చేసుకునేవారి వద్దకు వెళ్లి గేటువద్ద నుంచుని డబ్బు అడిగి తీసుకుని ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేశారు. ఈ విధంగా ఆసుపత్రి స్థాపనకు అవసరమైన డబ్బు సమీకరించి బెల్గాచియాలో 12బీఘాలు (దాదాపు 20 ఎకరాలు) భూమిని కొనుగోలు చేశారు. అక్కడ 30 పడకలతో ఆసుపత్రిని నిర్మించారు. ఆసుపత్రికి ఆల్బర్ట్ విక్టర్ ఆసుపత్రిగా పేరుపెట్టారు. (ప్రిన్స్ ఆల్బర్ట్ విక్టర్ 18వేల రూపాయలు ఆసుపత్రికి ఇచ్చారు. 1904లో ఫిజిషియన్స్ సర్జన్స్ బెంగాల్‌కు చెందినవారు కాలేజీని ఏర్పాటుచేశారు. మెడికల్ కాలేజీకి 1916లో కోల్‌కతా యూనివర్సిటీ గుర్తింపునిచ్చింది. మొదట ఈ కాలేజీకి బెల్గాచియా మెడికల్ కాలేజీ అని పేరుపెట్టారు. అనంతరం కార్ మిచెల్ మెడికల్ కాలేజీగా పేరు మార్చారు. ఆయన ఆసుపత్రి రెండవ అంతస్తును ప్రారంభించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత కాలేజీకి ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీగా పేరుపెట్టారు.భారతదేశంలో మొట్టమొదట ఫార్మసూటికల్ కంపెనీ ఏర్పాటుకు డాక్టర్ రాధా గోవింద్‌కర్ సహాయం చేశారు. ఆచార్య ప్రఫుల్ చంద్ర రాయ్ స్వీయచరిత్ర ప్రకారం డాక్టర్ రాధా గోవింద్‌కర్ దేశంలో ఔషధాల ఉత్పత్తికి కీలకమైన పాత్ర వహించారు. ఆయన 1918 డిసెంబరు 19న ఫ్లూ వ్యాధితో మరణించారు. ఆయన చనిపోయేనాటికి సొంత ఆస్తి ఏమీలేదు. బెల్గాచియాలో తనకున్న ఇంటిని మెడికల్ కాలేజీకి తన విల్లులో రాశారు. 19వ శతాబ్దిలో బెంగాల్ ప్రజలకు గొప్ప సేవలు అందించారు. ప్రస్తుతం దెయ్యాలు ఈ ఆసుపత్రిని ఆక్రమించడం అత్యంత విచారకరం.

ఎడిట్ డెస్క్

ప్రముఖులకు విజ్ఞాన్ పురస్కారాలు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం మొట్టమొదటిసారి అత్యున్నత సైన్స్ పురస్కారాన్ని అందజేసింది. ప్రఖ్యాత బయోకెమిస్ట్, బెంగుళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్ గోవిందరాజన్ పద్మనాభన్‌ను విజ్ఞాన్ రత్న అవార్డుతో సత్కరించారు. రాష్ట్రపతి భవన్‌లో ని గణతంత్ర మండపంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేశారు. 13 విజ్ఞాన్ శ్రీ పురస్కార్, 18 విజ్ఞాన్ యువ-శాంతి స్వరూప్ భట్నాగర్ ప్రైజ్‌లు, ఒక విజ్ఞాన్ టీమ్ అవార్డును కూడా రాష్ట్రపతి అందజేశారు. చంద్రయాన్-3 మిషన్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందానికి విజ్ఞాన్ టీమ్ అవార్డు దక్కింది. ప్రాజెక్టు డైరెక్టర్ పీ వీరముత్తువేల్ ఆ అవార్డును అందుకున్నారు. అవార్డు గ్రహీతలందరికీ ఓ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు.

'నా కొడుకులను కాల్చి చంపండి'

పోలీస్ కమిషనర్ ఎదుట తండ్రి ఆవేదన

బెంగళూరు: 'నా కొడుకులతో పరువు పోతోందని వారిద్దరినీ తుపాకీతో కాల్చి చంపండని' హుబ్బళ్లి నగర పోలీస్ కమిషనర్ ఎదుట తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. హుబ్బళ్లిలో రెండు రోజులక్రిందట రౌడీల మధ్య గ్యాంగ్‌వార్ జరిగింది. రౌడీషీటర్ అఫ్తాబ్ కరడిగుడ్డపై పోలీసులు కాల్పులు జరిపారు. రౌడీషీటర్‌లు జావూద్ బేఫారి, అఫ్తాబ్ కరడిగుడ్డ ముఠాల మధ్య గొడవలు ఉన్నాయి. పాత కక్షలతో వారు గ్యాంగ్‌వార్‌కు పాల్పడ్డారు. జావూద్‌పై దాడి చేసి తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులు అఫ్తాబ్ కాలికి కాల్పులు జరిపి పట్టుకున్నారు. ఆ తర్వాత రౌడీ షీటర్ ఇంటిపై శశికుమార్ నేతృత్వంలో దాడి జరిపారు. దీంతో అఫ్తాబ్ తండ్రి మహ్మద్‌గౌస్ కమిషనర్ ఎదుట తన గోడు వెళ్లబోసు కున్నారు. మహ్మద్ గౌస్ మాట్లాడుతూ నా ఇద్దరు కొడుకులు దారి తప్పారని కంటతడిపెట్టారు. హత్యాయత్నంలో ఇద్దరు పాల్గొన్నారని, వారి నుంచి మర్యాద పోయిందని, ఇద్దరినీ తుపాకీతో కాల్చి చంపాలని కన్నీరు పెట్టారు. ఈమేరకు కమిషనర్ శశి కుమార్ తీవ్రంగా హెచ్చరించారు. బుద్ధి చెప్పకపోతే మేమే తగిన గుణపాఠం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రాష్ట్ర హోదాకే మా ప్రాధాన్యత: రాహుల్

శ్రీనగర్ : అన్ని అధికారాలతో జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరి ంపజేయడమే కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ప్రాధాన్యమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఇది ఎన్నికలకు ముందే జరుగుతుందని ఊహించామని, కానీ ఎన్నికల కోడ్ విడుదలైందన్నారు. శ్రీనగర్‌లో కాంగ్రెస్ శ్రేణులతో సమావేశమైన తర్వాత రాహుల్ మీడియాతో మాట్లాడారు. జమ్ముకశ్మీర్ ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధముందని తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించడం ఒక ముందడుగు అని రాహుల్ పేర్కొన్నారు. వీలైనంత త్వరలో కశ్మీర్ ప్రజల హక్కుల పునరుద్ధరణ జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. సాయం అందించడంలో ప్రజలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రస్తుతం జమ్ముకశ్మీర్‌లో గడ్డు కాలం నడుస్తోందన్న రాహుల్... దానిని తాము అర్థంచేసుకుని, హింసను తొలగించాలని భావిస్తున్నట్లు తెలిపారు. సోదరభావంతో ప్రేమ దుకాణాన్ని తెరవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం ఇదే తొలిసారి. ఇలా గతంలో ఎన్నడూ జరగలేదు. కేంద్రపాలిత ప్రాంతాలు రాష్ట్రాలుగా మారాయి. కానీ, రాష్ట్రం కేంద్రపాలిత ప్రాంతంగా మారడం ఇదే మొదటిసారి. జమ్ముకశ్మీర్, లడ్డాఖ్ ప్రజలు తమ హక్కులను తిరిగి పొందడం మా ప్రాధాన్యమని కాంగ్రెస్ జాతీయ ఎన్నికల ప్రణాళికలో మేం స్పష్టంగా చెప్పాం" అని రాహుల్ పేర్కొన్నారు.

మాజీ ప్రధానులపై విదేశాల్లో విమర్శలా

మోదీపై జైరాం రమేశ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ... విదేశీ గడ్డపై దేశ మాజీ ప్రధానులను, ఆర్థిక విధానాలను విమర్శిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. విపక్ష నేత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ దేశాన్ని విమర్శిస్తారని ప్రధాని మోదీ పదేపదే అసత్యాలు వల్లెవేస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పూర్తిగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాము అన్ని దేశాలతో సరైన సంబంధాలను నెరపుతామని, ఆయా దేశాల నుంచి సాయం కూడా పొందామని గుర్తుచేశారు. విదేశాలకు వెళ్లినప్పుడు రాహుల్ గాంధీ మన దేశంపై విమర్శలు గుప్పిస్తారని మోదీ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, కానీ విదేశీ పర్యటనల్లో మోదీ చేస్తున్నదేంటని జైరాం రమేశ్ నిలదీశారు. 2014లో మోదీ అమెరికా పర్యటనలో మన మాజీ ప్రధానిని విమర్శించారని గుర్తుచేశారు. బీజేపీకి దీటైన పోటీ ఇస్తున్న పార్టీ కావడంతోనే ఆ పార్టీ పాలకులు నిత్యం కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాహుల్ గాంధీ ఒక్కరే బీజేపీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారని అన్నారు.

తప్పు చేయకపోతే జేపీసీ భయమెందుకు?

'మోదానీ'ని నిలదీసిన కాంగ్రెస్

జంతర్ మంతర్ వద్ద నిరసనలు - సెబీ చైర్మన్ రాజీనామాకు డిమాండ్

న్యూఢిల్లీ: అదానీ వ్యవహారంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని, సెబీ చైర్‌పర్సన్ మాధవి బచ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విచారణ పారదర్శకంగా జరగాలని పేర్కొంది. అదానీ మెగా స్కామ్‌పై విచారణకు డిమాండ్‌తో దేశవ్యాప్తంగా గురువారం కాంగ్రెస్ అధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. పార్టీ దిల్లీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ నేతృత్వంలో జంతర్ మంతర్ వద్ద ధర్నాలో సీనియర్ నేత సచిన్ పైలట్, కన్హయ కుమార్, ఉదిత్ రాజ్‌తో పాటు నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సచిన్ పైలట్ మాట్లాడుతూ 'తప్పు చేయనప్పుడు జేపీసీ ఏర్పాటు చేసేందుకు భయం ఎందుకు' అని ప్రశ్నించారు. జేపీసీ ద్వారా నిష్పాక్షిక, పారదర్శక విచారణ జరగాలనే కాంగ్రెస్ కోరుతోందని, ఈ విషయం దేశం మొత్తానికి తెలియాలని ఆయనన్నారు. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడినప్పటి నుంచి మోదానీ కుంభకోణంపై పారదర్శక విచారణ కోసం కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. తాజాగా హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వెలువరించిన నివేదిక ప్రకారం సెబీ చైర్‌పర్సన్ మాధవి బచ్, ఆమె భర్తకు అదానీ సంస్థలో పెట్టుబడులు ఉన్నట్లు వెల్లడైంది. ఈ కారణంగానే అదానీ సంస్థపై తగు విధంగా సెబీ దర్యాప్తు చేయలేకపోయినట్లు హిండెన్‌బర్గ్ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను మాధవి బచ్, గౌతం అదానీ తోసిపుచ్చారు.

నిరసనలు రాజకీయ ప్రేరేపితం కాదు

బద్లాపూర్ వ్యవహారంలో షిండే వ్యాఖ్యలపై ఉద్ధవ్

ముంబై: ఇద్దరు చిన్నారులు లైంగిక వేధింపులకు గురైన బద్లాపూర్ ఘటనపై రాజకీయం జరుగుతోందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చేసిన విమర్శలను శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే తిప్పికొట్టారు. నిరసనలు రాజకీయ ప్రేరేపితమని, నిరసనకారుల్లో బయట వ్యక్తులు చాలా మంది ఉన్నారని సీఎం చేసిన వ్యాఖ్యలను ఉద్ధవ్ తీవ్రంగా ఖండించారు. మానసిక వికలాంగులు లేక దోషులను కాపాడేవారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారన్నారు. మహా వికాస్ అగాఢీ (ఎంవీయే) ఈనెల 24న బంద్‌కు పిలుపు ఇవ్వడం వెనుక రాజకీయ ఉద్దేశమేమీ లేదని, మహిళలకు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకే ఇందుకు పూనుకున్నట్లు ఉద్ధవ్ ఠాక్రే వెల్లడించారు. తమ ఆందోళన అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పెద్దఎత్తున ప్రచారం చేసి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి మఝి లడ్కీ బహిన్ యోజన వంటిది కాదని... ప్రజాగ్రహానితో కూడుకున్నదని ఆయనన్నారు. రాష్ట్రంలో ఆడపడుచులకు రక్షణ లేనప్పుడు లడ్కీ బహిన్ యోజన వల్ల ప్రయోజనం ఏమిటని ఉద్ధవ్ ప్రశ్నించారు. బద్లాపూర్ ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు చేసిన వారిపై కేసులు పెట్టడాన్ని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి సున్నితత్వం లోపించిందని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు. ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యాన్ని ఖండించారు. ఇద్దరు బాలికల్లో ఒకరి తల్లి గర్భిణీగా ఉండి కొన్ని గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చిందన్నారు. ఆందోళనలు జరిగినప్పుడు ముఖ్యమంత్రి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. 24వ తేదీన మహారాష్ట్ర బంద్ జయప్రదానికి ఉద్ధవ్ ఠాక్రే పిలుపునిచ్చారు.

శాంతిభద్రతలపై గవర్నర్ వ్యాఖ్యలు విచారకరం: ప్రియాంక్ ఖర్గే

బెంగళూర్: కర్నాటకలో శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందని రాష్ట్ర గవర్నర్ పేర్కొనడం తనకు విస్మయం కలిగించిందని కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరసనలు జరగడం లేదని, కేవలం బీజేపీ శ్రేణులే నిరసనలు చేపడుతున్నారని అన్నారు. ప్రియాంక్ ఖర్గే గురువారం బెంగళూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఎస్ యడియూరప్ప ప్రాసిక్యూషన్‌కు అనుమతించినప్పుడు బీజేపీ గవర్నర్ తీరును తప్పుపడుతూ నిరసన తెలిపిందని, కర్నాటక బంద్‌కు పిలుపు ఇచ్చిందని గుర్తుచేశారు. తాము ఎప్పుడైనా ఇలా వ్యవహరించామా అని ప్రశ్నించారు. కర్నాటక సీఎం సిద్ధరామయ్య ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా గవర్నర్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పార్టీ శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పేలా వ్యవహరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఖర్గే ఆరోపించారు. కర్నాటకలో రాజ్యాంగ సంక్షోభానికి గవర్నర్ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. శాంతిభద్రతలు గాడితప్పాయని స్వయంగా రాష్ట్ర గవర్నర్ వ్యాఖ్యానించడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు.

త్రిపురలో భారీ వర్షాలు, వరదలకు 10మంది మృతి

అగర్తల: భారీ వర్షాల వల్ల త్రిపురలో పెద్ద ఎత్తున వరదలు సంభవించాయి. ఇప్పటి వరకు 34 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరంతా 330 సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. కాగా ఆదివారం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో కొన్నిచోట్ల కొండచరియలు విరిగి పడటం, నీటిలో కొట్టుకుపోవడం వల్ల 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరొకరు గల్లంతయ్యారు. రాష్ట్రంలోని అనేక నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. గోమతి నది అత్యంత ప్రమాదకరస్థాయిని దాటింది. ముఖ్యమంత్రి మాణిక్ సాహా చేసిన కేంద్ర ప్రభుత్వానికి చేసిన అభ్యర్థన మేరకు సహాయక చర్యల కోసం నాలుగు అదనపు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రాష్ట్రానికి చేరుకున్నాయి. కాగా భారీ వర్షాల కారణంగా పశ్చిమ త్రిపుర, సెపాహిజాలా జిల్లాల్లో గురువారం రెడ్ అలర్ట్ ప్రకటించారు. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), ఎన్డీఆర్ఎఫ్, అసోం రైఫిల్స్‌తో సహా కేంద్ర పారామిలిటరీ బలగాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున వరదలు ఎన్నడూ సంభవించలేదని ముఖ్యమంత్రి మాణిక్ సాహా పేర్కొన్నారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, బాధిత ప్రజలకు అన్ని విధాలా సాయం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

రాజస్థాన్‌లో...

రాజస్థాన్‌లో రుతుపవనాల ప్రభావంతో జోరు వానలు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల్లో కోటా, అజ్మీర్ సహా నాలుగు జిల్లాల్లో గురువారం భారీ వర్షాలు కురిసినట్లు వాతావరణశాఖ గురువారం వెల్లడించింది.

వరదలకు మా డ్యామ్ కారణం కాదు

బంగ్లాదేశ్‌కు భారత్ వివరణ

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ భారీ వర్షాలు, వరదలతో ఇబ్బందిపడు తోంది. ఆ దేశ తూర్పు ప్రాంతం లోని అనేక జిల్లాల్లో ప్రాణనష్టం సంభవిస్తోంది. అయితే అక్కడ సంభవించిన వరదలకు భారత్ డ్యామ్ కారణమని ఆరోపణలు వచ్చాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం సవివరంగా స్పష్టత ఇచ్చింది. త్రిపురలోని గోమతి నదిపై ఉన్న డ్యామ్ గేట్లు తెరవడం వల్ల ఈ పరిస్థితి ఎదురైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపింది. 'భారత్, బంగ్లాదేశ్‌ల్లో ప్రవహిస్తోన్న ఈ నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయితే బంగ్లాలో వరదలకు దిగువ పరివాహక ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు కారణం' అని వెల్లడించింది. 'ఈ డ్యామ్ సరిహద్దు నుంచి చాలా దూరంలో ఉంది. దీని ఎత్తు కూడా తక్కువే. దీనినుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 40 మెగావాట్ల విద్యుత్‌ను బంగ్లాదేశ్ ఉపయోగించుకుంటోంది. ఇక ఆగస్టు 21 నుంచి త్రిపురతో పాటు బంగ్లాదేశ్‌లోని అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. డ్యామ్‌లో నీటి ఉధృతి గురించిన సమాచారాన్ని బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు మేం అందించాం. వరదల కారణంగా ఏర్పడిన విద్యుత్ అంతరాయం వల్ల సమాచార పంపిణీలో సమస్యలు ఏర్పడ్డాయి. ఇతర మార్గాల్లో కమ్యూనికేషన్ కొనసాగించేందుకు మేం ప్రయత్నించాం' అని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ భారీ వర్షాల వల్ల త్రిపురలోనూ వరదలు సంభవించాయి. ఇప్పటివరకు 34 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఏకధాటిగా కురుస్తున్న వానలతో కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడటం, నీటిలో కొట్టుకుపోవడం వల్ల 10 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని అనేక నదులు ప్రమాదకరస్థాయి దాటి ప్రవహిస్తున్నాయి. గోమతి నదిలో నీటిమట్టం ఏకంగా అత్యంత ప్రమాదకర స్థాయిని దాటడం ఆందోళన కలిగిస్తోంది.

50 రోజుల్లో శిక్ష పడేలా చట్టాలు

హత్యాచార ఘటనలపై అభిషేక్ బెనర్జీ

కోల్‌కతా: అత్యాచార కేసుల్లో 50 రోజుల్లోగా దోషులకు శిక్షపడేలా చట్టాలు రావాలని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అభిషేక్ బెనర్జీ అన్నారు. ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో జరిగిన హత్యాచార ఘటనపై నిరసనలు వ్యక్తమవుతోన్న వేళ... దేశంలో ఆ తరహాలో ఎన్నో కేసులు వెలుగు చూశాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన గురువారం స్పందించారు. 'గత పది రోజులుగా ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో జరిగిన ఘటనపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. న్యాయం కావాలంటూ వైద్యులు, ఇతరులు రోడ్లపై నినదిస్తున్నారు. ఈ దిగ్భ్రాంతికర నేరానికి వ్యతిరేకంగా ప్రజలు రోడ్లపై ఉన్న సమయంలోనే దేశంలో అలాంటివి 900 కేసులు వెలుగులోకి వచ్చాయి. రోజూ 90 అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. వీటిని నిరోధించడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. కేవలం వాగ్దానాలకే పరిమితం కాకుండా 50 రోజుల్లోగా విచారణలు పూర్తయి శిక్షలు ఖరారయ్యేలా కఠిన చట్టాలు రావాలి. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి' అని అభిషేక్ పోస్టు పెట్టారు.

వివక్ష రహిత సమాజం

పార్టీ జెండా ఆవిష్కరణలో విజయ్ ప్రతిన

చెన్నై: దళపతిగా సినీరంగంలో చెరగని ముద్ర వేసిన ప్రముఖ తమిళ కథానాయకుడు విజయ్ తన పార్టీకి చెందిన జెండాను, గీతాన్ని గురువారం ఆవిష్కరించారు. కొంతకాలం క్రితం రాజకీయ రంగ ప్రవేశంపై ప్రకటన చేయడమే కాకుండా 'తమిళగ వెట్రీ కళగం' పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. తాజాగా ఆ పార్టీకి సంబంధించి జెండాను ఆవిష్కరించారు. చెన్నైలో తన పార్టీ కార్యాలయంలో విజయ్ ఈ జెండా ఎగురవేశారు. ఎరుపు, పసుపు రంగుల్లో ఉన్న ఈ జెండాపై మధ్యలో వాగాయి పువ్వుకు రెండు ఏనుగులు అటూ, ఇటూ ఉన్నాయి. తమిళ సంప్రదాయం ప్రకారం ఈ పువ్వును విజయానికి గుర్తుగా అభివర్ణిస్తారు. జెండాతో పాటు పార్టీ గీతాన్ని కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తల్లిదండ్రులతో పాటు మద్దతుదారులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి విజయ్ ప్రతిజ్ఞ చేశారు. 'మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన యోధులను, తమిళ నేల నుంచి వెళ్లి మన హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన అసంఖ్యాక సైనికులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. కులం, మతం, లింగం, ప్రాంతం పేరుతో జరుగుతున్న వివక్షను మేం తొలగిస్తాం. ప్రజలకు అవగాహన కల్పించి అందరికీ సమానహక్కులు, అవకాశాల కోసం కృషి చేస్తాం. సమానత్వం అనే సూత్రాన్ని బలంగా సమర్థిస్తాం' అని విజయ్ ప్రతినబూనారు. మరో రెండేళ్లలో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామాలు కీలకంగా మారాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో విజయ్ రాజకీయ పార్టీని ప్రారంభించినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోనని ముందే స్పష్టంచేశారు. ఇతర పార్టీలకు కూడా మద్దతివ్వలేదు. 2026లో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బరిలోకి దిగుతామని విజయ్ ప్రకటించారు.

ఎస్పీ నేత షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేత

లక్నో: అయోధ్యలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సమాజవాదీ పార్టీ నేత, నిందితుడు మొయిద్ ఖాన్ వ్యవహారంలో యోగి ప్రభుత్వం మరింత కఠిన వైఖరి అవలంబించింది. మొయిద్ ఖాన్‌కు చెందిన బేకరిని కూల్చివేసిన మరునాడే... అతడికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని కొంత భాగాన్ని సైతం నేలమట్టం చేసింది. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని కొంత భాగాన్ని గురువారం కూల్చివేసినట్లు ప్రభుత్వాధికారులు వెల్లడించారు. మొయిద్ ఖాన్ ప్రభుత్వ భూమిలో అక్రమంగా భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని అధికారులు తెలిపారు. ఆ కాంప్లెక్స్‌లోని కొంత భాగాన్ని కూల్చి వేశామని వివరించారు. మిగిలిన భాగాన్ని సైతం సాధ్యమైనంత త్వరగా కూల్చివేస్తామని తెలిపారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను ఖాళీ చేయించిన అనంతరం... కూల్చివేతకు చర్యలు చేపట్టామని వారు వివరించారు. మరోవైపు మొయిద్ ఖాన్ చేతిలో లైంగిక దాడికి గురైన బాలికకు ప్రభుత్వం మరింత రక్షణ పెంచింది. భద్రతలో భాగంగా ఆమె కుటుంబాన్ని బదర్సా పట్టణానికి తరలించింది. లైంగిక దాడి బాధితురాలైన బాలిక... లక్నోలోని కేజీఎంయూలో వైద్య సహాయం తీసుకుంటుంది. ఆమె నివసించే ప్రాంతంలో శాంతి భద్రతల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు పోలీస్ సీనియర్ అధికారి వివరించారు. ఆ బాలిక నివాసం వద్ద దాదాపు 30 మంది పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేశామన్నారు.

రైతు సమస్యలపై కమిటీ: సుప్రీం



న్యూఢిల్లీ: హర్యానాలోని అంబాలా సమీపంలోని శంభూ సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లోగా తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం రైతుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు బహుళ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. రైతులు ఎదుర్కొంటున్న తాత్కాలిక సమస్యలను ఆ కమిటీకి తెలపాలని పంజాబ్, హర్యానా ప్రభుత్వాలను కోరింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. ఆగస్టు 12న అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు నిరసన తెలుపుతున్న రైతులతో తాము సమావేశం నిర్వహించామని పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకు తెలియజేసింది. అంతేకాకుండా జాతీయరహదారిపై ఏర్పాటుచేసిన బారికేడ్లను పాక్షికంగా తొలగించేందుకు అంగీకరించినట్లు వివరించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైతు ఉద్యమం సందర్భంగా 'చలో దిల్లీ'ని అడ్డుకునేందుకు రాష్ట్రప్రభుత్వం బారికేడ్లు ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. అయితే వాటిని వారంలోగా తొలగించాలని పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

మహిళా జర్నలిస్ట్‌పై అసభ్య వ్యాఖ్యలు

చిక్కుల్లో శివసేన షిండే వర్గం నేత

ముంబై: బద్లాపూర్‌లో చిన్నారులపై జరిగిన హత్యాచారాన్ని కవర్ చేస్తున్న ఓ మహిళా జర్నలిస్ట్‌పై శివసేన (షిండే) వర్గం నేత చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలు వివాదాస్పదయ్యాయి. హత్యాచార ఘటనను కవర్ చేస్తున్న తనపై శివసేన (షిండే) వర్గం నేత వామన్ మాత్రే... అసభ్య వ్యాఖ్యలు చేశారని స్థానిక టీవీలో పనిచేసే మహిళా జర్నలిస్టు ఆరోపించారు. 'బద్లాపూర్ మాజీ మేయర్ అయిన వామన్ మాత్రే నాపై చేసిన వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు. ఆయన వ్యాఖ్యలు చాలా ఆగ్రహం కలిగించాయి. నేను నిజాల ఆధారంగానే హత్యాచార ఘటనను కవర్ చేశాను' అని మహిళా జర్నలిస్ట్ అన్నారు. దీనిపై వామన్ మాత్రే స్పందిస్తూ జర్నలిస్ట్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మహిళా జర్నలిస్ట్ శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గంతో కుమ్మక్కయ్యారని అన్నారు. 'ఇది ఆ మహిళా జర్నలిస్ట్ చేస్తున్న ఒక స్టంట్. ఆమె నాకు చాలా రోజుల నుంచి తెలుసు. ఆమె శివసేన(యూబీటీ)కి అనుకూలంగా పనిచేస్తారు. మీరు ఈ సంఘటనను రెండుమూడు రోజులుగా కవర్ చేస్తున్నారు. బాలికలపై దాడి జరిగిందా? లేదా? అనే దాని గురించి సరైన సమాచారాన్ని నివేదించాలని అడిగాను. అంతేకాని, నేను ఆమెతో అసభ్యంగా మాట్లాడలేదు' అని అన్నారు. మరోవైపు వామన్ మాత్రే చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిచాయి. ఆయనపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశాయి. మాత్రే వ్యాఖ్యలను ముంబై ప్రెస్ క్లబ్ ఖండించింది. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను కోరింది. ప్రజల మనోభావాలను, పత్రికా గౌరవాన్ని ఇలా నిర్లక్ష్యం చేయడం ఆమోదయోగ్యం కాదని ఒక ప్రకటనలో పేర్కొంది.

మహిళలపై అకృత్యాలు

151 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ దేశంలోని 151 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై మహిళలపై అకృత్యాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని ప్రముఖ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించడం సంచలనం రేపుతోంది. ఈ జాబితాలో పశ్చిమబెంగాల్‌కు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారని నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా 151 మంది చట్టసభ్యుల్లో 16 మందిపై అత్యాచార ఆరోపణలు కూడా ఉన్నట్లు ప్రకటించింది. బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన చెరో ఐదుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్నారని స్పష్టం చేసింది. 2019-2024 మధ్య ఎన్నికల సమయంలో భారత ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల అఫిడవిట్లను ఏడీఆర్ పరిశీలించింది. అందులో మహిళలపై నేరాలకు సంబంధించి కేసులు ఎదుర్కొంటున్న 16 మంది ఎంపీలు, 135 మంది ఎమ్మెల్యేలు ఉన్నట్లు గుర్తించింది. బెంగాల్‌కు చెందిన 25 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అందులో ఉన్నారని తెలిపింది. 21 మంది చట్టసభ్యులతో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని నివేదికలో పేర్కొంది. ఒడిశాకు చెందిన వారు 17 మంది ఉన్నట్లు చెప్పింది. మొత్తంగా 16 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలపై అత్యాచారం కేసులు ఎదుర్కొంటున్నారని, వీరిపై నేరాలు రుజువైతే 10 ఏళ్లు లేదా జీవిత కాల కారాగార శిక్ష పడే అవకాశం ఉందని నివేదిక స్పష్టంచేసింది. అత్యధికంగా 54 మంది బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ తరహా కేసులు ఎదుర్కొంటు ండగా.. 24 మంది కాంగ్రెస్ నేతలు ఉండడం గమనార్హం. ఆ తర్వాత స్థానంలో 17మందితో టీడీపీ ఉంది. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ ఈ నివేదిక వెలువడడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరగాలని ఈ సందర్భంగా ఏడీఆర్ కోరింది. నేరాలు ఎదుర్కొంటున్న నేతలను దూరం పెట్టాలని ఓటర్లకు విజ్ఞప్తి చేసింది.

అత్యాచారాల నిరోధానికి మరింత కఠిన చట్టం అవశ్యం

మోదీకి మమత లేఖ

కోల్‌కతా: బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఘటనతో దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు మిన్నంటిన వేళ అత్యాచారాల నిరోధానికి మరింత కఠినమైన కేంద్ర చట్టం అవసరమని ప్రధాని మోదీ దృష్టికి రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీసుకెళ్లారు. ఇదే విషయమై ఆమె గురువారం లేఖ రాశారు. అత్యాచారాలు, లైంగిక వేధింపుల కేసుల్లో విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ప్రధానిని కోరారు. 'దేశంలో అత్యాచారాలు, హత్యాచారాలు పేట్రేగినట్లు అందుబాటులోని డేటా చెబుతోంది. నిత్యం 90 అత్యాచారాలు నమోదవుతుండటం భయానకం. ఈ పరిణామం దేశాన్ని కలచివేస్తోంది. సామాజిక స్పృహకు విఘాతం కలిగిస్తోంది. ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. మహిళలకు రక్షణ, భద్రత కల్పించేలా అత్యాచారాలకు అంతం పలకడం మనందరి బాధ్యత. ఇలాంటి తీవ్రమైన, సున్నితమైన అంశాలకు సమగ్ర పరిష్కారం అవసరం. అందుకోసం మరింత కఠినమైన కేంద్ర చట్టాన్ని తేవాలి. హేయమైన నేరాలకు పాల్పడిన వారికి అత్యంత కఠినమైన శిక్షలు అమలు చేసేలా ప్రతిపాదిత చట్టం రూపొందాలి. కేసుల విచారణ వేగవంతంగా జరిగేందుకు ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసేలా చట్టం ఉండాలి. కేసుల్లో విచారణ 15 రోజుల్లోగా పూర్తి కావాలి' అని లేఖలో ప్రధానిని మమత కోరినట్లు ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అల్పన్ బందోపాధ్యాయ వెల్లడించారు.

కమ్యూనిస్టుల బలం, ప్రాతినిధ్యం పెరగాలి

సీపీఐ తెలంగాణ సమితి సమావేశాల ప్రారంభోత్సవంలో రాజా

విశాలాంధ్ర-హైదరాబాద్: నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమించడం ద్వారా కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. పంచాయితీ నుంచి పార్లమెంట్ వరకు పార్టీ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కమ్యూనిస్టుల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్న ప్రజలు విశ్వసించాలన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు గురువారం హన్మకొండలో ప్రారంభమయ్యాయి. తొలుత హరిత హోటల్ ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని రాజా ఆవిష్కరించారు. సీపీఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశాలలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంత్ రావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాజా మాట్లాడుతూ, రాజకీయ పరిణామాలను వివరించారు. మితవాద, మతవాద, పెట్టుబడిదారీ శక్తులను ఎదుర్కొని సమసమాజాన్ని నిర్మించేందుకు కమ్యూనిస్టులు మరింత బలాన్ని పెంచుకోవాలని నొక్కిచెప్పారు. విద్యార్థి, యువత, కార్మిక, కర్షక, మహిళలు తదితర వర్గాలను రాజకీయంగా చైతన్యపర్చాలని, వాటి ప్రజా సంఘాలను పటిష్టంగా నిర్మించాలని రాజా సూచించారు. కమ్యూనిస్టు శ్రేణులు స్ఫూర్తి పొందేలా సీపీఐ శతాబ్ది ఉత్సవాలను కాన్పూరులో, మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ శతజయంత్యుత్సవాన్ని నాగపూర్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదికపై సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజీపాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, కలవేణి శంకర్, వీఎస్‌బోస్, ఎన్.బాలమల్లేశ్, ఎం.బాలనరసింహా, ఈటీ నరసింహా ఆశీనులయ్యారు.

సీపీఐ నేతలకు, ప్రముఖులకు సంతాపం

ఇటీవల కాలంలో మరణించిన సీపీఐ నేతలు, వామపక్ష, ప్రజాస్వామ్యవాదులు, ప్రముఖులకు పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి సంతాపం తెలిపింది. బాగం హేమంతరావు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సమితి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ అధినేత న్యూయెన్ ఫ్యూ త్రోంగ్, కమ్యూనిస్టు దిగ్గజనేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి డీఎస్ రామచంద్రరావు, స్వాతంత్ర సమరయోధురాలు దొడ్డా సక్కుబాయమ్మ, సీపీఐ మహారాష్ట్ర నేత, స్వాతంత్ర సమరయోధులు ప్రేనుపురణ, అనంతపురం జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు ఎంవీరమణ, సీపీఐ(ఎంఎల్) నాయకుడు రాయల చంద్రశేఖర్, ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం, భరతనాట్యం కళాకారిణి యామిని కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లా మధిర మండలం, అల్లినగరం సర్పంచ్ గౌస్, రైతు నాయకులు చింతా స్వరాజ్యం మృతికి సంతాపాన్ని తెలియేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉత్తరప్రదేశ్‌లో తొక్కిసలాట, వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి మరణించిన వారితో పాటు ఢిల్లీ రావు కోచింగ్ సెంటర్లో నీట మునిగి ప్రాణాలు కోల్పోయిన యూపీఎస్సీ అభ్యర్థులకూ సీపీఐ సంతాపం తెలియజేసింది.

న్యాయం చేయండి

సీఎం, డిప్యూటీ సీఎంకు వలంటీర్ల లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: తమకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖలు పంపినట్లు వలంటీర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్య పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిరబ్ కుమార్ ప్రసాద్‌కి మెయిల్ ద్వారా లేఖలు పంపారు. మూడు నెలల గౌరవ వేతన బకాయిలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జల ఈశ్వరయ్య, అధ్యక్షులు ఎం.జగదీష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి ఎంవీ రమణా నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లంకా గోవిందరాజులు డిమాండ్ చేశారు. వలంటీర్లకి రూ.10 వేల జీతం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో లక్షకు పైగా వలంటీర్‌లు రాజీనామా చేశారని, ఆ రాజీనామాలను బలవంతపు రాజీనామాలుగా పరిగణించి వారిని కూడా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రవి, రాజేష్, వాసు, మహదేవ్ ఉన్నారు.

'ఉపాధి'కి బృహత్తర ప్రణాళిక

రూ.4,500 కోట్లతో 87 రకాల పనులు

నేడు 13,326 పంచాయతీల్లో గ్రామసభలు: పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల సంయుక్త అధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనులపై చర్చించేందుకు శుక్రవారం రాష్ట్రంలో 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన ప్రైవేటు క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. ఉపాధి హామీ ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయా పంచాయతీల్లో ప్రజలంతా కలిసి గ్రామసభలలో తీర్మానాలు చేయనున్నారన్నారు. రూ.4,500 కోట్ల నిధులతో 87 రకాల పనులు చేయనున్నామని, తొమ్మిది కోట్ల పనిదినాలు, 54 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించే బృహత్తర ప్రణాళిక అమలు చేస్తామని పేర్కొన్నారు. మన గ్రామాలను మనమే పరిపాలించుకుందాం అనేలా వీటి నిర్వహణ ఉంటుందని చెప్పారు. ప్రధాని మోదీ సంకల్పం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో పంచాయతీలను స్వయంశక్తి పంచాయతీలుగా సాకారం చేసుకునేలా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంటుందని, కళలు, ఆహార పదార్థాలు, వస్త్రాలు, ఇతర కళాకృతుల తయారీకి గ్రామాలు ప్రత్యేకమని అన్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురంలో పూలు ప్రసిద్ధి, అరకులో కాఫీ, మంగళగిరి చీరలు, సత్యసాయి జిల్లాలో లేపాక్షి, బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణాజిల్లాలో చిలకలపూడి, ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి హస్తకళలకి ప్రసిద్ధి అన్నారు. వీటి ప్రత్యేకతలను గుర్తించి వాటిని ప్రమోట్ చేయాలని భావిస్తున్నామని వివరించారు. సంపద సృష్టించే మార్గాలను అన్వేషిస్తామన్నారు. పంచాయతీ సంస్కరణల్లో భాగంగా మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు నిధులను పెంచి పంచాయతీలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చామన్నారు. పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న భూమిని క్రమపద్ధతిలో వినియోగించుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రూ.రెండు వేల కోట్ల నిధులను కూటమి ప్రభుత్వంలో విడుదల చేశామని, మెటీరియల్ కంపోనెంట్ గ్రాంట్‌ను త్వరలోనే ఇస్తామని వెల్లడించారు. పంచాయతీల్లో ఓ ప్రణాళిక ప్రకారం నీటి సమస్యను తీర్చేందుకు ముందుకు వెళ్తామని పవన్ కల్యాణ్ అన్నారు.

పరిశ్రమల్లో రక్షణపై ప్రత్యేక దృష్టి

అచ్యుతాపురం ఎసెన్షియా సంస్థలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని పవన్ అన్నారు. సేఫ్టీ ఆడిట్‌ను కఠినంగా అమలు చేస్తే పారిశ్రామికవేత్తలు భయపడతారని, అయితే పరిశ్రమలు కచ్చితంగా అక్కడ పనిచేసే వారికి కనీస రక్షణ పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ అంశంపై తానే ప్రత్యేకంగా దృష్టి పెడతానని, ఈ నెల చివర్లో విశాఖపట్నంలో ప్రత్యేకంగా దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తానని వెల్లడించారు.

వక్ఫ్ బిల్లుకు మేం వ్యతిరేకం

ముస్లిం మైనార్టీలకు జగన్ స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వక్ఫ్ బిల్లులపై పార్లమెంట్‌లో వైసీపీ వ్యతిరేకిస్తుందని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గురువారం ముస్లిం మైనార్టీలతో జగన్ సమావేశమయ్యారు. ముస్లిం మైనార్టీల సమస్యలపై వైసీపీ ఎల్లవేళలా ప్రత్యేక దృష్టి పెట్టిందని, వారి సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేశామన్నారు. వైసీపీ తప్పకుండా మీ వెంట నడుస్తుందని, వక్ఫ్ బిల్లుపై మీరు ప్రస్తావిస్తున్న అన్ని అంశాలను పార్టీ ఎంపీలు పార్లమెంటులో లేవనెత్తుతారని వివరించారు. ఇంకా పార్లమెంటు సంయుక్త కమిటీ (జేపీసీ)లో సభ్యుడిగా ఉన్న ఎంపీ విజయసాయిరెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకుని, అన్ని అభ్యంతరాలను పార్లమెంటు దృష్టికి తీసుకెళ్తారన్నారు. ముస్లిం సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, వక్ఫ్ భూముల్లో దాదాపు 70 శాతానికి పైగా కబ్జాలో ఉన్నాయని, కొత్తగా ప్రతిపాదించిన వక్ఫ్ చట్టంలో రూపొందించిన నిబంధనల ద్వారా తమ (వక్ఫ్) భూములు తమకు దక్కకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బిల్లును వైసీపీ వ్యతిరేకించడం వల్లనే, కేంద్రం దాన్ని జేపీసీకి పంపిందని గుర్తుచేశారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు జగన్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వెల్లడించారు. వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా జీఓ 60 జారీ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

మాజీ ఎమ్మెల్యే సొంత ఇంటికి వెళ్లే పరిస్థితేది? జగన్

ఒక మాజీ ఎమ్మెల్యే తన సొంత ఇంటికి వెళ్లే పరిస్థితులు కూడా రాష్ట్రంలో లేవని, తాడిపత్రిలో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ అని జగన్ అన్నారు. ఎస్పీకి సమాచారం ఇచ్చి వెళ్లినా టీడీపీ మూకలు అడ్డుకున్నాయని, వైసీపీ నాయకుడి ఇంటిని తగలబెట్టాయని, వాహనాలను ధ్వంసం చేశాయని ఆయన ట్వీట్ చేశారు. కిందిస్థాయిలో ఇన్ని దారుణాలు జరుగుతుంటే, నేరం చేయాలంటేనే భయపడాలంటూ పైన ఉన్న చంద్రబాబు కబుర్లు చెబుతున్నారని, ఇంతకన్నా నిస్సిగ్గుతనం ఏముందని జగన్ ప్రశ్నించారు.

సింథటిక్ ఉడ్, హైడ్రో ఫాయిల్ బోట్లు

ఏపీలో తయారీకి ఆరియా గ్లోబల్ ఆసక్తి

సహకరిస్తామని మంత్రి జనార్దన్‌రెడ్డి హామీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బయో సింథటిక్ ఉడ్ తయారీ యూనిట్‌తో పాటు హైడ్రో ఫోయిల్ బోట్లు తయారు చేసే పరిశ్రమలు పెట్టేందుకు ఆరియో గ్లోబల్ సింగపూర్, స్పెయిన్ కంపెనీ ముందుకు వచ్చింది. ఈ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్ కుమార్ రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో గురువారం సచివాలయంలో భేటీ అయ్యారు. సహజసిద్ధమైన చెక్కకు తీసిపోని విధంగా ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి బయో సింథటిక్ ఉడ్‌ను తయారు చేస్తున్నామని మంత్రికి తెలిపారు. బయో సింథటిక్ ఉడ్ వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదన్నారు. అడవుల సంరక్షణకు, వివిధ రంగాల్లో బయోసింథటిక్ వినియోగంతో నిర్వహణ ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో హైడ్రో ఫోయిల్ బోట్లు తయారు చేస్తున్నామని, వీటిని త్వరలో భారత నావికా దళానికి సరఫరా చేయడానికి చర్చలు ముగిశాయని, తుది నిర్ణయం నేవీ ఉన్నతాధికారుల పరిశీలనలో ఉందని సంపత్ కుమార్ తెలిపారు. ఈ బోట్లు తయారు చేసే కంపెనీని ఏపీలో నెలకొల్పి, ఇక్కడి నుంచే బోట్లు తయారు చేసేందుకు తాము సిద్ధమన్నారు. ఇవి సాధారణ బోట్ల కంటే సురక్షితంగా ఉంటాయని, కోస్టల్ పెట్రోలింగ్‌కు ఉపయోగకరమని తెలిపారు. ప్రభుత్వ సహాయ సహకారాలతో బయో సింథటిక్ ఉడ్ తయారీ, బోట్ల తయారీ కంపెనీలను రూ.300కోట్లతో పెడతామని చెప్పారు. ఇందుకు సంబంధించిన అన్ని వివరాలను మంత్రికి సంపత్ కుమార్ సమర్పించారు. దీనిపై ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి సత్వరమే కంపెనీ పెట్టేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సంపత్ కుమార్‌తో మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు.

బదిలీల మినహాయింపునకు మార్గదర్శకాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాధారణ బదిలీల (2024) ప్రక్రియలో భాగంగా వివిధ గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల బాధ్యుల మినహాయింపు కోసం తాజాగా మార్గదర్శకాలను జారీజేశారు. రాష్ట్ర/జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన సేవా సంఘాల ప్రతినిధులు ఈ బదిలీల మినహాయింపులోకి వస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బదిలీలపై నిషేధాన్ని తొలగించింది. ఈనెల 31వ తేదీలోగా బదిలీలు నిర్వహించుకోవాలని ఆర్థికశాఖ ఇటీవల జీవో 75 ద్వారా ఉత్తర్వులిచ్చింది. గుర్తింపు పొందిన ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు చెందిన రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయి బాధ్యులకు బదిలీల నుంచి తొమ్మిది సంవత్సరాలు మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆయా ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకత్వం, వారి రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల ప్రధాన బాధ్యుల జాబితాలను హెచ్ఓడీల ద్వారా సంబంధిత కలెక్టర్లకు పంపాల్సి ఉంటుంది. కొన్ని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి బదిలీల నుంచి మినహాయింపునకు ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వం గుర్తించింది. దీంతో తాజాగా సాధారణ పరిపాలన సెక్రటరీ పోలా భాస్కర్ ఏడు అంశాలతో కూడిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఎవరైతే బదిలీల మినహాయింపు కోరుతున్నారో, ఆ బాధ్యుల పేరు కలిగిన ఓటర్ల జాబితా సమర్పించాలి. మినహాయింపు కోరిన బాధ్యుడి పోస్టు, నిబంధనావళి పరిధిలో ఉందా లేదా అని రుజువు చేసుకోవాలి. ఆయా శాఖ ఎన్నికకు నియమించిన ఎన్నికల అధికారి వివరాలు వెల్లడించాలి. ఆ శాఖకు చెందిన ఎన్నిక నోటిఫికేషన్ పత్రాన్ని సమర్పించాలి. ఎన్నికైనటువంటి కార్యవర్గానికి ఆయా శాఖా బాధ్యుల నుంచి అధికారికంగా ధృవీకరించిన పత్రం ఇవ్వాలి. బదిలీల నుంచి మినహాయింపు కోరిన బాధ్యులు కో-ఆప్షన్ మెంబరు అయితే, దానికి సంబంధించిన సంఘం తీర్మాన పత్రాన్ని జత చేయాలి. ఈ బదిలీల మినహాయింపును అత్యల్ప కేటగిరీ ఉద్యోగి నుంచి గెజిటెడ్ కేటగిరీ అధికారుల వరకు వర్తిస్తుంది. పత్రాల జారీలో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని ప్రభుత్వం స్పష్టంచేసింది.

వర్ధమాన పారిశ్రామికవేత్తలకు సృజనాత్మక నైపుణ్యత అవశ్యం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వీఐటీ విశ్వవిద్యాలయంలోని ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ క్లబ్ సంయుక్త అధ్వర్యంలో ప్రపంచ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన "ఐడియా పిచింగ్" అనే కార్యక్రమంలో 46 జట్లు నమోదు చేసుకోగా, వాటిలో 30 జట్లు తుది పోటీకి ఎంపికయ్యాయి. న్యాయనిర్ణేతలు ... జట్ల అద్భుతమైన ప్రతిభ ఆధారంగా గ్రాండ్ ఫినాలే కోసం ఆరు అగ్రశ్రేణి జట్లు షార్ట్‌లిస్ట్ చేయబడ్డాయి. చివరకు మూడు జట్లు విజేతలుగా నిలిచాయి. వీటిలో పార్క్ ఎయిడ్ - పార్కింగ్ కష్టాలను తగ్గించడానికి ఒక విప్లవాత్మక పరిష్కారం సూచించగా, ఫెమ్టోలి - మహిళల భద్రతకు భరోసా కల్పించే అత్యాధునిక కార్యక్రమం రూపొందించింది. ఇక అభయ అడ్వకేట్ జట్టు - మహిళలకు న్యాయ సహాయం అందించే సాధికార వేదికను సూచించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజీవ్ కపూర్ మాట్లాడుతూ వర్ధమాన పారిశ్రామికవేత్తలు వారి సృజనాత్మక నైపుణ్యంతో సామాజిక సమస్యలను సునాయసంగా పరిష్కరించే మార్గాలను కనుగొనాలని కోరారు. వీఐటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వి. కోటా రెడ్డి మాట్లాడుతూ విశేష ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన వర్ధమాన పారిశ్రామికవేత్తలను అభినందించారు. ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ డైరెక్టర్ డాక్టర్ అమీత్ చవాన్, డా. ఎస్.ఎస్.శాంతకుమారి, డా. షైకు షాహిదా సాహెబ్, డా. కాషిఫ్ బేగ్, డా. కౌశిక్ ఎన్. భుయాన్, డా. రాజశ్రీ నాయ్, డా. సెంతమిజ్ సెల్వి, డా. నంద్రు ప్రభాకర్, డా. నవనీత కృష్ణన్ పాల్గొన్నారు.

సీఎం ప్రోద్బలంతోనే దాడులు

వైసీపీ లీగల్‌సెల్ భేటీలో జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, సీఎం ప్రోద్బలంతోనే వైసీపీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులు కొనసాగుతున్నాయని వైసీపీ అధినేత వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. ఒక పద్ధతి ప్రకారం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం వైసీపీ లీగల్‌సెల్ ప్రతినిధులతో జగన్ భేటీ అయ్యారు. ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఒకవైపు ప్రకటనలు చేస్తూనే, మరోవైపు యథేచ్ఛగా దాడులు చేయిస్తున్నారని, ఎక్కడికక్కడ రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగుతోందని, ఆస్తుల ధ్వంసం, కేసులు పెట్టే లక్ష్యంతో ముందుకు పోతున్నారని మండిపడ్డారు. గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిల్లో టీడీపీ నాయకులు రెడ్‌బుక్‌లు ఓపెన్ చేసి, విధ్వంసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎక్కడా న్యాయం, ధర్మం కనిపించడం లేదని, పోలీసులు పూర్తిగా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో న్యాయవాదుల అవసరం చాలా ఉందని, కేసులు పెట్టించడం నుంచి కోర్టులో వాదనలు వినిపించడం వరకు పార్టీ శ్రేణులకు న్యాయం చేయడానికి ఒక పద్ధతి ప్రకారం అడుగులు వేద్దామని చెప్పారు. లాయర్ల సంక్షేమం, అభివృద్ధి కేవలం వైసీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని... రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేశామని జగన్ గుర్తుచేశారు.

నేడు విశాఖకు జగన్

అనకాపల్లిజిల్లా అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో గాయపడి అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శుక్రవారం ఉదయం 11 గంటలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరామర్శించనున్నారు. ఉదయం 8 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10 గంటలకు విశాఖ చేరుకుంటారు, అక్కడి నుంచి నేరుగా అనకాపల్లి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం తిరుగు ప్రయాణమవుతారు.

సెజ్ ప్రమాదం వైసీపీకి ఆపాదిస్తారా?

మాజీ మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో ప్రమాదం జరిగిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ ప్రమాదాన్నీ వైసీపీపై రుద్దేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ ఘటనను చంద్రబాబు సీరియస్‌గా తీసుకోలేదని ధ్వజమెత్తారు. ప్రమాదం జరిగిన సమయంలో హోంమంత్రి, డీజీపీ అందరూ సెక్రటేరియట్‌లోనే ఉన్నారని, నాలుగు గంటలకు ప్రెస్‌మీట్ పెట్టి జగన్‌ను దూషించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యవస్థలన్నీ జగన్ నాశనం చేశారంటూ చంద్రబాబు ఆరోపించడాన్ని ఆయన తప్పుపట్టారు. అదే సెజ్‌లో ప్రమాదం జరిగి, గతంలో ముగ్గురు చనిపోతే ఎందుకు సేఫ్టీ ఆడిట్ చేయలేదని ప్రశ్నించారు.

పాఠశాలలోనే రక్షణ లేకపోతే ఎలా?

బద్లాపూర్ ఘటనపై బాంబే హైకోర్టు ఆగ్రహం

ముంబై: కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ పాఠశాల స్వీపర్ చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనను బాంబే హైకోర్టు సుమోటోగా విచారణకు చేపట్టింది. ఈ నేపథ్యంలో కోర్టు గురువారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'పిల్లలకు పాఠశాలలు సురక్షితమైన ప్రదేశాలు కాకపోతే... ఇక విద్యాహక్కు గురించి మాట్లాడటంలో అర్థం లేదు' అని వ్యాఖ్యానించింది. బాధిత కుటుంబాలు ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక పోలీసులు కేసు నమోదు చేయడంలో విఫలం కావడంపై కోర్టు తీవ్రంగా స్పందించింది. 'ఇలాంటి పరిస్థితి దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ ఘటన గురించి పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు అందిందా? మీరు ఏదైనా కేసు నమోదు చేశారా? ఈ నేరం గురించి రిపోర్టు చేయనందుకు పాఠశాల యాజమాన్యాన్ని కూడా విచారించేందుకు పోక్సో చట్టం అనుమతిస్తుంది' అని రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులను ఉద్దేశించి పేర్కొంది. దీనిపై రాష్ట్రం తరఫున వాదించిన అడ్వకేట్ జనరల్ వీరేంద్ర సరాఫ్ సమాధానమిస్తూ 'సిట్ ఏర్పాటు చేశాం. అది విచారణ జరుపుతుంది' అని తెలిపారు. ఈ సమాధానంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే పాఠశాలపై కేసు పెట్టి ఉండాల్సిందని అభిప్రాయపడింది. రెండో బాలిక పేరు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించింది. ఆ బాధిత చిన్నారులు భయం నుంచి బయటపడేందుకు కౌన్సెలింగ్ ఇప్పించారా అని ఆరా తీసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.